UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.3

January 2024

## ప్రతిరోజూ ఓ కొత్త రోజే



# భవిష్యత్‌కు భరోసా...

"2023వ సంవత్సరం చివరి తేదీ చాలా ప్రత్యేక మైనదని మీకు తెలుసా? న్యూమరాలజీ ప్రకారం ఈ తేదీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నెల, తేదీ, సంవత్సరం వరుసగా గమనిస్తే 123123 అని కనిపిస్తుందని, 1,2,3 అంకెలకు అర్థాలను చెబుతూ ఇవి చాలా ప్రాముఖ్యమని, మంచి చేస్తాయని" న్యూమరాలజిస్టులు చెప్పారు. ఈ తేదీకి సంబంధించిన వీడియోలు, న్యూస్, మీమ్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి.

క్రికెట్ ప్రపంచ కప్ 2023లో భారత్ గెలిచి తీరుతుందని చాలామంది జాతకరత్నలు రకరకాల లెక్కలేసి జోస్యం చెప్పారు. మరికొందరు తెలంగాణాలో టిఆర్‌యస్ ప్రభుత్వం ఖచ్చితంగా వస్తుందని రాశి, నక్షత్రాలు, గవ్వలూ అంటూ తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. కానీ ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయి. జ్యోతిష్యుల మాటలపై గురితో బెట్స్ కట్టి తీవ్రంగా నష్టపోయిన వాళ్ళు కోకొల్లలు.

జ్యోతిష్యం, న్యూమరాలజీ శాస్త్రాలని అనేకులు ఒప్పించే ప్రయత్నం చేసినా అది కేవలం ఉహాగానాలేనని చాలాసార్లు తేలిపోయింది. హస్త రేఖలు, జన్మ నక్షత్రాలు, రాశి ఫలాలు, జాతక చక్రాలు లాంటివి మనిషి జీవిత గమనాన్ని, జయాపజయాలను నిర్ణయిస్తాయనో, నిర్దేశిస్తాయనో నమ్మేవాళ్ళు చాలా మంది ఉన్నా నిర్దిష్టంగా ఎప్పుడూ అవి నిరూపించబడలేదు, పైగా విఫలమై నవ్వులపాలైన సందర్భాలు అనేకం. అలా చెప్పే వాళ్ల మాటలు ఎప్పుడో ఓసారి అనుకోకుండా గాలిలో విసిరిన రాయిలా తగులుతుంటాయే గాని అవేమాత్రం సత్యం కాదు.

జ్యోతిష్యం మన జీవితాలను నిజంగా శాసించగలదా? లేదనే ఖచ్చితంగా చెప్పాలి. జ్యోతిష్యం గురించి ఆలోచించే వారెవరైనా వేసుకోవాల్సిన ప్రశ్న ఇదే: మనం గ్రహాలు, నక్షత్రాల స్వరూపంలో ఉన్నామా? లేక వాటిని సృష్టించి, పరిపాలించే ఆ దేవుని స్వరూపంలో ఉన్నామా? ఈ ప్రశ్నకు వచ్చే జవాబును బట్టి వాటిని నమ్మాలా? లేక సృష్టికర్తను నమ్మాలా? అని నిర్ధారించుకోవచ్చు.

చర్చిలకు వెళ్ళే చాలామంది కూడా జ్యోతిష్యాన్ని, మూఢనమ్మకాలను నమ్ముతారు. పెళ్ళిళ్ళు, ఫంక్షన్స్ సమయాల్లో, ఇల్లు మారేటప్పుడు, కట్టేటప్పుడు మంచి రోజుల కోసం చూసుకోవడం, వార ఫలాలపై ఆధారపడుతూ అటు దేవుడు, ఇటు ఇవి అంటూ రెండు పడవల మీద కాలేస్తుంటారు. దీనికి కారణమేంటి? కీడు, మరణం, మనుగడ, భవిష్యత్‌ను గూర్చిన భయం వారిలో అంతర్లీనంగా ఉండడం వల్లే. అయితే క్రీస్తు సిలువ మరణం మన ప్రతి భయాన్నుంచి విడిపిస్తుంది (హెబ్రీ 2:14). గనుక విశ్వాసులు వాటికి భయపడాల్సిన పని లేదు.

క్రైస్తవ్యంలో కూడా దేవుని, పరిశుద్ధాత్ముని పేరుతో వాగ్దానాలు ఇవ్వడం, భవిష్యత్ గూర్చి చెప్పడం, దేవుడు చెప్పని వాటిని చెప్పినట్లు అబద్ధాలు చెబుతూ తమ పబ్బం గడుపుకొనేవారు, నవ్వులపాలైన బోధకులు అనేకులు ఉన్నారు. అలా చేసేవారు దేవుని నామాన్ని అపహాస్యం చేస్తున్నారనే విషయం మర్చిపోకూడదు. అందుకనే "క్రైస్తవ్యం బాగుపడాలంటే కొంతమంది సేవచేయడం మానేయాలని" అంటాడు ఒక భక్తుడు.

నూతన సంవత్సరంలో ప్రవేశించాం. నూతన ఆలోచనలు, ఆశలు, ఆశయాలతో ముందుకు వెళ్ళాలని ఆశిస్తున్నాం. అయితే, మన భవిష్యత్, భద్రతను గూర్చిన భయం, బాధలు మనలో లేకపోలేదు. అయితే ఒక్క విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. మన భవిష్యత్ మనకు తెలియకపోయినా మన భవిష్యత్ తెలిసిన దేవుడు, దేవుని వాక్యం మనకు ఉంది గనుక మనం భయపడాల్సిన పనిలేదు.

*ఈ నూతన సంవత్సరంలో మన దేవునిని మరింత ఎరుగుదాం:* దేవునిని వాక్య దృక్పథం నుండి కాక మన అనుభవాలు, అభిప్రాయాల గుండా చూసి చిన్నవాడిని చేసుకోవద్దు. బైబిల్ చరిత్రలో మన పితరులు, ప్రవక్తలు, అపోస్తలులు తమ దేవుడెవరో ఎరిగారు గనుకనే వారు అభద్రతా భావానికి లోనవలేదు, భయంకర పరిస్థితుల్లో సయితం ధైర్యాన్ని ప్రదర్శించారు, నిబ్బరంతో నిల్చొన్నారు. వారు అసాధారణ పరిస్థితుల్ని అసాధారణ విశ్వాసంతో ఎదుర్కొని దేవుని కొరకు గొప్ప కార్యాల్ని చేశారు (దానియేలు 11:32).

*ఈ నూతన సంవత్సరంలో దేవుని వాక్య ప్రకారం నడుద్దాం:* "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలు సరాళము చేయును" (సామెతలు 3:5,6). దేవుని చిత్తం నుంచి పారిపోయే వారికి వాహనాన్ని సిద్ధంగా ఉంచడమే సాతాను పని" అని అంటాడు ఓ భక్తుడు. గనుక స్వబుద్ధిని ఆధారం చేసుకొని ఆయన వాక్యం నుంచి పారిపోయి సాతానుకు చిక్కవద్దు.

*ఈ నూతన సంవత్సరంలో దేవునితో సమయం గడుపుదాం:* ఎక్కువ సమయం వాక్యధ్యానంలో, ప్రార్థనలో గడుపుదాం. "దేవునితో నీవు గడిపే సమయం నీ ప్రవర్తనను మారుస్తుంది, నీ భక్తి జీవితాన్ని పెంపొందిస్తుంది, సరైన మార్గంలో పయనించేటట్లు చేస్తుంది. ఇలాంటి జీవితం జీవిస్తున్నప్పుడు దేవుని విశ్వసించని ఈ లోకం దేవునిని తెలుసుకొంటుందని " ఛార్లెస్ స్టాన్లీ అంటాడు.

*నూతన సంవత్సర శుభాకాంక్షలతో...*

**– పి. సునీల్ జాకబ్**

# విద్యార్థి జ్వాల

Vol. 30, No. 3 January 2024
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

February: "Knowing...Growing....Serving"

**Note:** Please send your writeups on or before
**10th of every month**




# ఎంత మనోహరం!

నూతన ఆధ్యాత్మిక తీర్మానాలతో
తనువులో అణువణువూ దేవునికి ప్రతిష్ఠిస్తూ
నరనరాల్లో దైవోద్దేశాల్ని నింపుకొని
సందిగ్ధం లేని వాక్యజ్ఞానాన్ని పొంది
వరాలను వాడటంలో వర్ధిల్లుతూ, విజయో-
త్సవంతో దైవాజ్ఞల మార్గంలో పరిగెడుతూ
రక్షకుడైన యేసు నామంలోనే రక్షణనే
శుభ వర్తమానాన్ని ప్రకటిస్తూ
భారంతో దేవుని రాజ్యాన్నీ నీతిని వెదకే
కాంతివంతమైన క్రీస్తు శిష్యునిగా
క్షణభంగుర జీవితంలో ప్రతిక్షణం ప్రభుని సేవలో
లుసిఫర్ క్రియల్ని అధిగమిస్తూ లోకరక్షకుడిని ఘనపరిచే
జీవితం.

– **యస్. ఈశ్వర్** (ఆర్కిటెక్ట్), హైదరాబాద్

## లోపలి పేజీల్లో...


- భవిష్యత్‌కు భరోసా - 2
- ఎంత మనోహరం! - 3
- నవ జీవన మార్గమున - 4
- ప్రతిరోజూ ఓ కొత్తరోజే - 5
- స్వపరీక్ష - 8
- కమిట్‌మెంట్ విత్ గాడ్ - 11
- అబ్రాహాము - ప్రథమ ప్రాధాన్యత దేవునికే - 14
- యేసుక్రీస్తు శిష్యులు - 15
- బానిస బాలిక బ్లాండినా - 18
- సంభాషణ సరైనదేనా? - 21
- నిర్ణయాలు - 23
- ఏముందిలే, చిన్న విషయాలే కదా! - 26
- జీవితం అల్పమైనది - 29
- దీనత్వం- 30
- ఇదిగో కొత్తవాయెను - 32

# నవ జీవన మార్గమున నా జన్మ తరియింప

"నడిపించు నా నావ నడి సంద్రమున దేవా, నవ జీవన మార్గమున నా జన్మ తరియింప" ఎంత అద్భుతమైన అభ్యర్థన!

నవ జీవన మార్గం నూతన జీవితంతోనే ప్రారంభమవుతుంది. ఎన్నో సంవత్సరాల క్రితం ప్రారంభమైన మన నవజీవన మార్గం సవ్యంగా సమున్నత తీరాలకు చేరాలంటే, ముందుగా ఆ మార్గంలో కొనసాగాలి. కొనసాగుతున్నప్పుడు మన జన్మ తరించేలా జీవించాలనే కోరిక నిత్యమూ, అనుదినమూ మనల్ని ప్రోత్సహిస్తూ ఉండాలి.

యుఇయస్ఐ కుటుంబంలో మనముందున్న స్వప్నం లేదా సవాలు, మనం నవ జీవన మార్గంలో ప్రయాణిస్తూ, మన సహవాస సభ్యులను కూడా అదే మార్గంలో ఉత్సాహభరితులుగా కొనసాగేలా ప్రోత్సహించడం. ఇలా ముందుకు వెళ్ళే క్రమంలో మనల్ని గమనిస్తూ పయనిస్తున్న వాళ్ళు "మన జీవన మార్గం జన్మ తరించేలా ఉందని" గ్రహించిన వేళ మన ప్రయాణం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నట్టు. ఇది ఒకరి జీవితంలో మరొకరు గమనించేందుకు కేవలం ప్రసంగాలపై ఆధారపడక, సన్నిహితంగా, సంతోషంగా సమయం గడపాలి. దీని నిమిత్తం 1:3 (యంపిసి) మనకు సర్వదా అందుబాటులో ఉంది. నవజీవన మార్గంలో జన్మ తరించేలా పయనించాలంటే మనకు మనం వ్యక్తిగతంగా పురికొల్పుకొంటూ, ఇతరులను అలా జీవించేందుకు ప్రోత్సహించాలి. ఏదైనా కారణంతో వెనుకంజ వేసినట్లయితే అక్కడితో ఆగిపోక నూతన ఉత్సాహంతో నూతన సంవత్సరాన్ని ప్రారంభించాలి.



"నాకు క్షుణ్ణంగా తెలిసిన దానిని అత్యున్నత రీతిలో ఆచరిస్తుంటాను. గమ్యాన్ని చేరేవరకూ ఇలాగే చేస్తూ ముందుకు సాగుతాను" అని అబ్రహాం లింకన్ అంటాడు. ఇలా పరిస్థితులతో సంబంధం లేకుండా తనకు తెలిసిన దానిని అత్యున్నత రీతిలో ఆచరించడానికి ప్రధాన రహస్యం–అతనికి దేవునితో ఉన్న సాన్నిహిత్యం అని అర్థమవుతుంది. ఇలాంటి జీవనశైలి తనను అమెరికా అధ్యక్షునిగా తీర్చిదిద్దింది. ఒక అనామకుడు అమెరికా అధ్యక్షుడిగా మారడానికి రహస్యం – తెలిసిన దానిని అత్యున్నత రీతిలో ఆచరించడమే.

నవ జీవన మార్గములో జన్మతరించేలా ముందుకు వెళ్ళాలంటే– సత్యవంతుడు మనకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఆయన సహాయంతో మన జీవితాన్ని తరింప జేసుకోవడానికి మనం సంసిద్ధులమేనా?

'నడిపించు నా నావ, నడిసంద్రమున దేవా, నవ జీవన మార్గమున నా జన్మ తరియింప" అనే ప్రార్థనతో ఆగిపోకుండా, ప్రభువు సహాయంతో ప్రతిజ్ఞతో కూడిన మనసుతో నూతన సంవత్సరంలో కొనసాగాలని కోరుకొంటూ...

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




# ప్రతిరోజూ ఓ కొత్త రోజే

నూతనత్వాన్ని కోరుకొనే తత్వం మానవతత్వం. మనలోనూ, మన చుట్టూ ఉన్న సమాజంలోనూ, పరిస్థితుల్లోనూ ఎప్పటికప్పుడు కొత్త కొత్త మార్పులు కోరుకొంటాము. పైపై మెరగులు దిద్దుకోవడం ద్వారా, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా నూతనత్వాన్ని పొందగలమని ఆశ పడతాము. దీని కోసం ఎంతో శ్రద్ధ, ప్రయాస, సమయం కేటాయిస్తుంటాము. ఇంత ఆరాటం, పోరాటం చేస్తున్నా బాహ్య పురుషుడు రోజు రోజుకి పాతబడుతూ కృశించి, బలహీనమై, చివరికి మన్నై పోతాడు. అయితే రోజు రోజుకీ మెరుగుపడే నవ నూతనత్వం అంతరంగానికి సంబంధించినది, నైతికమైనది, శాశ్వతమైనది అని బైబిల్ బోధిస్తుంది. ఇది కేవలం యేసుక్రీస్తు అనుగ్రహించే అంతరంగంలోని మార్పుద్వారా నూతన వ్యక్తిగా, నూతన సమాజంగా, నిత్య సంతోషంగా, సజీవమైన నిరీక్షణతో కూడిన జీవనశైలి. రోజులు మారినా, సంవత్సరాలు మారినా చెరగనిది నూతనత్వం. ఇది నిత్యం ఉండేది. పరిస్థితుల మీద, మనకు సంభవించే హెచ్చు తగ్గుల మీద ఆధారపడేది కాదు.

ఇలాంటి నైతికపరమైన విలువలు కలిగిన నూతన వ్యక్తిత్వంతో కూడిన సమాజం కొరకు ఎంతో కృషి జరగుతూనే ఉంది. ఒక పక్క రిఫార్మర్స్ ఏళ్ళ తరబడి ఎన్నో రిఫార్మ్స్ తీసుకొస్తున్నారు. కానీ మనిషిలోని చెడుతనాన్ని, పాప స్వభావాన్ని రూపుమాపలేక పోతున్నారు. ఆర్థికపరమైన సంస్కరణలు, సామాజిక సంస్కరణలు నూతనత్వాన్ని తీసుకొని రాలేకపోతున్నాయి. ఒక పక్క కట్టుదిట్టమైన న్యాయ వ్యవస్థ చెడుతనాన్ని అరికట్టాలని, మనిషిని మార్చాలని ఎన్నో చట్టాలు, చట్ట సభలు, కోర్టులు, జైళ్ళు, జైలు గదులు పెరుగుతూనే ఉన్నా నేరాలు, ఘోరాలు ఎక్కువై పోయాయి. వ్యవస్థాగతమైన మార్పులు సమాజానికి నిజమైన నూతనత్వాన్ని తీసుకొని రాలేకపోతున్నాయి. మతపరమైన ఆచరణల ద్వారా నూతనత్వం పొందాలనుకొంటున్నాము. ఒక పక్క మనం చూస్తున్న సమాజంలో టేబుల్ పైన భక్తి నడుస్తుంది, టేబుల్ కింద అవినీతి నడుస్తూ ఉంటుంది. నవ సమాజ స్థాపనకు సెల్ఫ్ హెల్ప్ టెక్నిక్స్ అంటూ యోగాలాంటివి ప్రవేశపెట్టినా కూడా సమాజంలో చెడుతనం తగ్గకపోగా పెరుగుతూనే ఉంది. నూతనత్వం, నూతన సమాజం సృష్టించడానికి శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయి. మనకు కావలసిన జన్యుపరమైన సమాచారం ద్వారా హ్యూమన్ జీనోమ్ చేసుకొని తద్వారా కొత్త సమాజాన్ని సృష్టించుకోవచ్చుట! అది కూడా అకస్మిక మార్పులకు గురై మరింత చెడిపోయే ప్రమాదం ఉంది.

ఇకపోతే మనం స్వంత నిగ్రహం మీద నమ్మకంతో ప్రతి సందర్భంలో ముఖ్యంగా పండగలు, కొత్త సంవత్సరంలాంటి సందర్భంలో నూతనమైన తీర్మానాలు చేసుకోవడం పరిపాటి. “నాకు మంచి చేయాలనే కోరిక ప్రతిరోజూ నూతనంగా పుడుతున్నా, చేయకూడని కీడు చేస్తూ ఉన్నాను” అని ప్రముఖ తత్వవేత్త పౌలు తన అశక్తతను వ్యక్తం చేశాడు. స్వంత ప్రయత్నంతో నూతనత్వం రావాలనుకొంటే నిరాశే మిగులుతుంది (ఎఫెసీ 3:22,23).

ఈ నేపథ్యంలో బైబిల్ ఏమి చెబుతుందంటే, దేవుడు మనిషిని ప్రేమించడంలోనూ, పాపాన్ని ద్వేషించడంలోనూ మార్పులేనివాడు. ప్రతి రోజూ

మనల్ని మనం ప్రతిష్ట చేసుకొని పనిచేస్తే నూతన సంవత్సరంలోని ప్రతిరోజూ ఒక కొత్తరోజే. మరలా బాగా జీవిద్దామంటే అది తిరిగిరాదు. రేపు ఎలా ఎంటుందో మనకు తెలియదు. అందుకని యేసుప్రభువు శిష్యులకు చెప్పినట్లు పగలున్నప్పడే, దేవుడిచ్చిన అవకాశం మేరకు పవిత్రంగా జీవిస్తూ, సంబంధాలు నూతన పరుచుకొంటూ, పునరుద్ధరించుకొంటూ, నూతనత్వాన్ని అనుభవిస్తూ ఇతరులకు నూతన జీవితాన్ని ప్రసాదించే ప్రభువును పరిచయం చేయడానికి ప్రతిష్టించుకొందాం.

నూతనంగా దేవునికి తన ప్రజలపై వాత్సల్యత పుట్టుచున్నది, యెడతెగక నిలుస్తుంది. కాబట్టే మనము నిర్మూలము కాలేదు. దేవుడు కృపగలవాడు, ఎంతైనా నమ్మదగినవాడు అని యిర్మియా ప్రవక్త దేవుని గూర్చి పాడాడు (విలాప3:22,23). పాపంతో నిండివున్న సమాజాన్ని దేవుడు చూసి ప్రేమించి, ఆయన కుమారుని రక్తం ద్వారా విమోచించాడు. నూతన జన్మ అనుభవం ద్వారా నూతన వ్యక్తిగా చేయబడతాడు. ఇలాంటి నూతన జన్మ అనుభవం కలిగిన వ్యక్తులను నిత్యనూతన వ్యక్తులుగా మారుస్తూ, వారితో నూతన సమాజాన్ని నిర్మిస్తున్నాడు. క్రీస్తులో ఉన్న నిత్యనూతనత్వం, ప్రతిరోజూ సెలబ్రేట్ చేసుకొంటూ, ఆ నూతనత్వంలో నడుచుకోవడానికి, ఆయనకు ప్రతిష్టించుకోవడం ఎంతైనా అవసరం. హబక్కూకులా నూతన పరచమని ప్రార్థించాలి.

దేవుడు నవ సమాజ నిర్మాణకుడు. ఆర్థిక, సామాజిక స్థాయి, మతపరంగా ఇంకా అనేక రకాల విభజనతో ఊపిరాడకుండా ఉంటున్న సమాజం నుండి ప్రేమ, ఐక్యతతో కూడిన నూతనత్వం యేసుప్రభువు రక్తం ద్వారానే సాధ్యము. అపవిత్రమైన, ఒకరినొకరు భక్షించుకొనే తత్వం గల సమాజాన్ని పవిత్రముగా, ప్రేమతో ఒకరినొకరు పోషించుకొనే, భరించుకొనే, తగ్గించుకొనే నూతన సమాజం యేసు రక్తం ద్వారానే పుడుతుంది.

క్రీస్తు ప్రభువులో ఉన్న ఈ నూతనత్వం మరియు నూతన సమాజం గురించి పౌలు ఎఫెసీయులకు రాసిన పత్రికలో కీలకమైన అంశంగా ప్రస్తావించాడు. ఎఫెసీ సంఘ నేపథ్యం చూస్తే నైతికపరంగా నచ్చినట్టు ఇష్టానుసారంగా పాపములో జీవిస్తూ, దేవునితో సంబంధము లేకుండా ఒకరితో ఒకరికి పొసగని వర్గపోరాటంతో, పగతో కూడిన సమాజము పౌలు దేవుని మాటల ప్రకటన పరిచర్య, ప్రభువు కార్యం ద్వారా వారిలో నూతనత్వం, నూతన సమాజం ఏర్పడింది. ఈ నూతనత్వాన్ని ఎలా సెలబ్రేట్ చేసుకోవాలి? నూతనత్వంలో ఉన్న భాగ్యం, భారం, బాధ్యతను గుర్తుంచుకొని ఈ నవ నూతనత్వాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి, దేవునికి ప్రతిష్ట చేయాలి. ఎఫెసీ పత్రిక మొదటి మూడు అధ్యాయాల్లో నూతన సమాజంలోని వ్యక్తుల భాగ్యం, భారం గూర్చి తెలియజేస్తుంది. చివరి మూడు అధ్యాయాల్లో నూతన సమాజంలోని విశ్వాసుల బాధ్యతను, భద్రతను తెలియజేస్తుంది.

### 1. నూతనత్వంలోని భాగ్యం (ఎఫెసీ 1వ అధ్యాయం)

దోషము, కళంకముతో నిండిన మనలను క్రీస్తు రక్తం ద్వారా విమోచించి నిర్దోషులుగా, నిష్కళంకులుగా, నీతిమంతులుగా తీర్చి దేవుని ఎదుట యోగ్యులుగా నిలబెట్టడానికి చెడ్డవాళ్ళమని ముందుగా తెలిసి కూడా ఎన్నుకొన్నాడు. ఎంత భాగ్యం? మనలను ఎన్నుకొని, విమోచించి ఆయన కుమారునిగా, కుమార్తెగా దత్తత చేసుకొని నా స్థాయిని పెంచిన భాగ్యం ఈ నూతనత్వంలోనిది. అంతేగాక ఈ నూతనత్వంలో కొనసాగడానికి పరిశుద్ధాత్మ దేవునిని సహాయంగా, సంచకరువుగా ఇవ్వడం ఇంకెంత భాగ్యమో తెలుసుకోవాలని ప్రార్థన చేశాడు.

### 2. నూతనత్వంలోని బంధం (ఎఫెసీ 2వ అధ్యాయం)

యోగ్యతను బట్టి, పనిని బట్టి కాకుండా కృపనుబట్టి చెడిన మనల్ని క్రీస్తులో నూతన సృష్టిగా నూతన సమాజంగా చేసి పొసగని వర్గాల మధ్య సమాధానాన్ని తీసుకొచ్చి ఒకే కుటుంబంగా బంధించింది క్రీస్తురక్తం. దేవునితోను, తోటి వ్యక్తులతోను సమాధానాన్ని తీసుకొచ్చి కుటుంబ సంబంధాలకు మించిన బంధం ఇచ్చాడు.

అందుకనే పౌలు ప్రార్థనలో ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుతుందో అని మూడవ అధ్యాయంలో సంబోధించాడు. నూతన సమాజం దేవుని ప్రేమ ఎత్తు అంటే ఉన్నతత్వం, దాని లోతు అంటే ఎంత అధోగతిలో ఉన్న వ్యక్తికి చేరువవ్వగలడని,

అందరినీ చేరే వెడల్పు అనుభవించాలని ప్రార్థన చేశాడు.

### 3. నూతన సమాజం పట్ల భారం (ఎఫెసీ 3వ అధ్యాయం)

పొసగని రెండు వర్గాలైన యూదులను, అన్యులను దేవుడు యేసు రక్తం ద్వారా సమాధాన పరిచాడు. యేసులో ఒక నూతన పురుషునిగా చేసి ఏకం చేశాడు (ఎఫెసీ 2:15,16). ఈ సమాధాన సువార్తను పౌలుకు దేవుడు కృపద్వారా అప్పగించాడు. అందుకనే పౌలు అన్యజనులకు దేవుడిచ్చిన భారంతో ఈ సమాధాన సువార్తను ప్రకటించాడు. అంతేగాక భారంతో ఈ నూతనత్వం కొరకు ప్రార్థన చేశాడు. ప్రతి విశ్వాసి ప్రతిరోజూ ఈ భారముతో జీవించాలి.

### 4. నూతన సమాజం పట్ల బాధ్యత (ఎఫెసీ 4, 5 అధ్యాయాలు)

నూతనత్వం పొందిన ప్రతి ఒక్కరమూ నూతన సమాజంలో దేవుడిచ్చిన ఐక్యతను కాపాడుకోవడంలో శ్రద్ధ కలిగి ఉండాలని ఒకనినొకడు సహిస్తూ, వినయం, సాత్వికం చూపిస్తూ నూతనత్వంలోని పిలుపుకు తగినట్లుగా నడుచుకోవాలని కోరుతున్నాడు. ఈ నూతన సమాజంలోని వ్యక్తుల అవసరాలు తీరడానికి, సంపూర్ణం కావడానికి, పరిచర్య ధర్మం జరగడానికి దేవుడు నూతనత్వం పొందిన ప్రతి వ్యక్తికి పరిమాణము చొప్పున ఆయన వివిధ వరాలను పంచి ఇచ్చాడు. బోధించే వరం, ప్రవచించే వరం, సువార్త వరం, కాపరి వరం... మొదలైనవి. భిన్నమైన వరాలతో ఐక్యతను కాపాడుకోవాలనేది నూతనత్వం పొందిన ప్రతి వ్యక్తి బాధ్యత. అంతేగాక నూతన సమాజం పరిపక్వతలో ఎదగాలంటే అందరు వ్యక్తులు ప్రేమతో సత్యం చెప్పడం ద్వారా అందరూ సత్యమందు సంతోషించి ఎదగాలి.

ఒకప్పుడు ఎఫెసీ విశ్వాసులు సిగ్గు లేకుండా మనసుకు కలిగిన వ్యర్థతను అనుసరించి అపవిత్రతను అత్యాశసతో జరిగిస్తూ, కాముకత్వానికి అప్పగించుకొన్నారు. అయితే ఇప్పుడు దేవుని పోలికగా సృష్టింపబడిన కొత్త సృష్టి. అంతా నూతనమే (2 కొరింథీ 5:17). కాబట్టి పాత స్వభావమును వదులుకొని నూతన స్వభావముతో ఐక్యతతో పాటు, పవిత్రతను కూడా కాపాడుకోవడంలో శ్రద్ధ కలిగి ఉండాలి. అంటే నిజం చెప్పడంలోనూ, ఇతరుల మీద ఆధారపడక చేతులతో కష్టపడడంలోనూ, మేలుకరమైన, అనుకూలమైన భావ వ్యక్తీకరణలోనూ, లైంగికతలోనూ పవిత్రతను కాపాడుకోవాలని కోరుతూ, నూతన సమాజానికి నాంది అయిన కుటుంబ జీవితంలో ఈ ఐక్యత, పవిత్రతకు పౌలు సూచనలిచ్చాడు.

### 6. నూతన సమాజం యొక్క భద్రత (ఎఫెసీ 6 అధ్యాయం)

నూతన సమాజాన్ని పాడుచేసే శత్రువును ఎదుర్కోవడానికి స్థిరంగా, ధీటుగా నిలబడాలి అంటే మన శక్తి, చిత్తం, సంకల్ప బలం చాలవు. దేవుని బల ప్రభావాలు అవసరం. వాటికోసం వారు ఆయనవైపే చూడాలి. వాటినిస్తాడని ఆయన్ను నమ్ముకోవాలి (1 యోహాను 5:14-15). ప్రభువు యొక్క మహా శక్తిని ఇచ్చాడు కాబట్టి ఆయన యందు బలవంతులై ఉండాలి. ఆయన వాక్కును నిర్లక్ష్యం చేయకూడదు. ఈ పోరాటంలో మనం బలవంతులమై ఉండేలా సహాయపడేందుకు బైబిల్ మొత్తం మనకు అందుబాటులో ఉంది. ఎదిరించడానికి దేవుడిచ్చిన సర్వాంగకవచాన్ని ధరించి పూర్ణమైన పట్టుదలతో, ప్రార్థనతో మెళకువగా ఉండాలని కోరాడు. ఏ మాత్రం శత్రువుకు చోటిచ్చినా నూతనత్వాన్ని నాశనంచేసి దేవుని ఉద్దేశాలను నెరవేర్చకుండా చేసే ప్రమాదముంది.

### ముగింపు

క్రీస్తు రక్తం ద్వారా పొందిన నూతనత్వంలో కొనసాగడం ఆటోమెటిక్‌గా జరగదని, మన ప్రయాస ఉందని గమనించాలి. గనుక పైవిధంగా మనం ప్రతిష్ఠ చేసుకొని పని చేస్తే నూతన సంవత్సరంలోని ప్రతిరోజూ ఒక కొత్తరోజే. మరలా బాగా జీవిద్దామంటే అది తిరిగి రాదు. రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. అందుకని యేసుప్రభువు శిష్యులకు చెప్పినట్లు పగలున్నప్పుడే, దేవుడిచ్చిన అవకాశం మేరకు పవిత్రంగా జీవిస్తూ, సంబంధాలు నూతన పరుచుకొంటూ, పునరుద్ధరించుకొంటూ, నూతనత్వాన్ని అనుభవిస్తూ, ఇతరులకు నూతన జీవితాన్ని ప్రసాదించే ప్రభువును పరిచయం చేయడానికి ప్రతిష్ఠించుకొందాం.

– బి. రంగనాథం, వైజాగ్

ప్రత్యేకం

# స్వపరీక్ష



విశ్వాస జీవితంలో ఎన్నో లోటుపాట్లు పతనాలు సర్వసాధారణం. కాని వాటిని సరిచేసుకొని, పురోభివృద్ధికి పథకాలు రచించుకోవడం ఆవశ్యం. ప్రాథమికంగా ఎప్పటికప్పుడు మన విశ్వాసాన్ని, మన సాక్ష్యాన్ని, మన ఆత్మీయ స్థితిని బేరీజు వేసుకోవడం జరగాలి. ఎందుకంటే మనకు ఒక నిరీక్షణ ఉంది. ఒక రోజున మనమందరం ప్రభువు ముందు నిల్చొని మన జీవితం గురించి లెక్క చెప్పాలి. ఆ లెక్క ప్రకారం ఆయన మనకు జీతం ఇస్తాడు. అది ఎలా ఉండబోతుందో మనకు స్పష్టంగా తెలియజేయలేదు గానీ తప్పక అది మనకు మహా సంభ్రమాశ్చర్యాలను కలుగ చేస్తుంది. “తనను ప్రేమించు వారికి ఏమి సిద్ధపరచెనో అవి కంటికి కనపడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరం కాలేదు” (1 కొరింథీ 2:9). “ప్రతివాడు (విశ్వాసి) తాను చేసిన కష్టము కొలది జీతము పుచ్చుకొనును” (1 కొరింథీ 3:8). “వాని వాని పని కనబడును, ఆ దినము దానిని తేటపరచును. అది అగ్ని చేత బయలు పరచబడును, మరియు వాని వాని పని ఎట్టిదో దానిని అగ్నియే పరీక్షించును. పునాది మీద ఒకడు కట్టిన పని నిలిచిన యెడల వాడు జీతం పుచ్చుకొనును. కాల్చి వేయబడిన యెడల వానికి నష్టం కలుగును (1 కొరింథీ 3:13-15). కాబట్టి మన విశ్వాస జీవితం ఒక అగ్నిపరీక్ష గుండా వెళుతుందని దైవ గ్రంథం చెబుతుంది. ఈ అగ్ని పరీక్ష రాబోయే వెయ్యేండ్ల పరిపాలనలో, నిత్యత్వంలో బహుశా మన అంతస్తును, మహిమను నిర్ణయిస్తుంది. కాబట్టి మన పని ఎలా ఉందో ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం చాలా సమంజసం. పౌలు భక్తుడు కూడా “మీరు విశ్వాసం గలవారై ఉన్నారో లేదో మిమ్మల్ని గూర్చి మీరే శోధించుకొని చూచుకొనుడి. మిమ్మును మీరే పరీక్షించుకొనుడి (2 కొరింథీ 13:5) అని చెప్పాడు. ప్రభు రాత్రి భోజనం గురించి రాస్తూ అక్కడ కూడా “ప్రతివాడు తనను తాను పరీక్షించుకొనవలెను” అని చెప్పాడు. ఈ వచనాలన్నీ మనకు స్వపరీక్ష యొక్క ప్రాముఖ్యతను గూర్చి మనలను హెచ్చరిస్తు న్నాయి. “పరీక్షించుకోని జీవితం అసలు జీవితమే కాదు” అని అంటాడు ప్రముఖ తత్వవేత్త సోక్రటీస్. విశ్వాసి ఎప్పటికప్పుడు తన విశ్వాస జీవితాన్ని పరీక్షించుకొంటూ ముందుకు సాగిపోవడం జ్ఞాన యుక్తమైన కార్యం.

## స్వపరీక్షకు కొలమానం దేవుని వాక్యమే

అయితే ఎలా పరీక్షించుకోవాలి? ఏ కొలమానం ప్రకారం తన జీవితాన్ని కొలుచుకోవాలి? దేవుని వాక్యంలో దేవుడు మన క్రియలను గూర్చి తీర్పు తీర్చునప్పుడు ఏ ప్రమాణాలను పరిగణలోనికి తీసుకొని పరీక్షిస్తాడో వివరించబడింది. కాబట్టి మన జీవితాన్ని అప్పుడప్పుడు దేవుని సన్నిధిలో ఒంటరిగా కూర్చొని పరీక్షించుకొనేటప్పుడు ఆ ప్రమాణాల ప్రకారం కొలుచుకొంటే లేక తూకం వేసుకొంటే మన గురించి సరైన అవగాహనకు రాగలము. దేవుడు తన వాక్యంలో, మన జీవితాలను ఏ విధంగా క్రీస్తు న్యాయ పీఠం దగ్గర పరీక్షించి వెయ్యేండ్ల పరిపాలనలో మనం అనుభవించే జీతము, అంతస్తు నిర్ణయిస్తాడో గమనిద్దాం. సామెతలు 11:1లో ఆయన త్రాసు న్యాయమైనది, ఆయన కొలరాయి కూడా సరైనది అని ఉంది.

## 1. రహస్య జీవితం (మత్తయి 6:4,6,8)

"రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫల మిచ్చును".

ప్రభువు ఒక విశ్వాసి జీతం నిర్ణయించేటప్పుడు, ఆ వ్యక్తి యొక్క బహిరంగ జీవితాన్ని అనగా ఆ వ్యక్తి పది మందిలో జీవించే జీవితం, ఎలా పని చేస్తాడు? ఎలా మాట్లాడతాడు? ఎలా ప్రవర్తిస్తాడో? దానిని ప్రాతిపదికగా తీసుకోడు. మన బహిరంగ జీవితం చాలా సార్లు వేషధారణతో కూడినదిగా ఉంటుంది. చాలాసార్లు మనం మనుషులు కోసం బతుకుతాం. వాళ్ళు, వీళ్ళు ఏమనుకొంటారోనన్న తలంపు, దేవుడు ఏమనుకుంటాడో నన్న తలంపు కన్నా బలంగా మన మీద పని చేస్తుంది. అయితే ఎవరూ మనల్ని గమనించడానికి లేనప్పుడు ఒంటరిగా ఉన్నప్పుడు, మనం ఎవరమో తెలియని ప్రాంతంలో ఉన్నప్పుడు, ఉద్యోగంలో పై అధికారులు లేనప్పుడు, మన భార్య లేక భర్త లేనప్పుడు, స్టూడెంట్స్ అయితే మన తల్లిదండ్రులు లేనప్పుడు, మన చుట్టూ విశ్వాసులు లేనప్పుడు, అప్పుడు మనం కనపరిచే ప్రవర్తనే మన అసలు ప్రవర్తన, అదే మన జీవితం. దానికి మార్కులు పడతాయి. మనం చాలాసార్లు ఇక్కడ ఎవరూ లేరు, నన్ను ఎవ్వరూ గమనించడం లేదు అనుకొని మనల ను మనమే మోసం చేసుకొంటాము, సిసి కెమెరాల్లో గమనించని దొంగల్లాగా. ఆదికాండం 39:9లో "నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యం చేసి దేవునికి విరోధంగా పాపం కట్టుకొందును" అని యోసేపు, దానియేలు 6:2లో "నా దేవుని దృష్టికి నిర్దోషినిగా కనబడితిని గనుక ఆయన తన దూతనంపి సింహములు నాకు హాని చేయకుండా వాటి నోళ్ళు మూయించెను" అని దానియేలు చెప్పినట్లు చూడగల ము. హెబ్రీ 11:27లో మోషే "విశ్వాసమును బట్టి అతడు అదృశ్యుడైన వానిని చూచుచున్నట్లు స్థిర బుద్ధి గలవాడై రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను" అని ఉంది.

ఈ రహస్య జీవితానికి, అనగా బయటకు మనుషులకు కనబడని జీవితానికి మనకు ఎంత జీతం వస్తుందో స్వపరీక్ష చేసుకొందామా?

## 2. మాటలు (మత్తయి 12:36,37)

"మనుషులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చి విమర్శ దినమున లెక్క చెప్పవల

> మనుష్యులు బయటకు కనపడే బహిరంగ క్రియలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కానీ దేవుడు మన క్రియలను కొలిచేటప్పుడు వాటి వెనుక ఉన్న ఆలోచలను, ఉద్దేశాలను లెక్కలోనికి తీసుకొంటాడు. ఫలానా పని లేక మాట ఏ ఉద్దేశంతో చేశావు లేక చెప్పావు? ఫలానా సహాయం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటి? ఇవే దేవుడు లెక్కలోనికి తీసుకొనే అంశాలు. మనుష్యులు వీటిని పట్టించుకోరు. వారికి జరిగిన క్రియ మాత్రమే కనిపిస్తుంది. కాబట్టి మన క్రియలకు అగ్నిపరీక్ష ఈ ప్రాతిపదికలో జరుగుతుంది.

సియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడు అని తీర్పునొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు".

విశ్వాసులు అధికంగా నిర్లక్ష్యపెట్టే పాపం ఇదే. నా మాటలు ఎలా ఉన్నాయి? మన మాటలతో ఎంతమంది హృదయాలను గాయపరిచాము? (సామెతలు 12:18), ఎన్ని కుటుంబాల్లో అగ్ని వేశాము? (యాకోబు 3:6), ఎంతమంది కన్నీటికి మన మాటలు కారణము? ఎంతమంది మీద మనం చూడని విషయాల గురించి మాట్లాడాము? ఎన్ని చిన్న విషయాలను పెద్దవిగా చేసి చెప్పాము? ఎన్ని అబద్ధాలు (యెషయా 59: 3), ఎన్ని అపవాదులు, ఎన్ని దూషణలు, ఎన్ని గర్వపు మాటలు, ఎన్ని వదరుబోతు మాటలు చెప్పాము? లేదా, నా మాటలు వల్ల ఎందరు ఓదార్చబడ్డారు? ఎన్ని కుటుంబాలు కట్టబడ్డాయి? ఎంతమంది కన్నీళ్ళు తుడవబడ్డాయి? ఎంత మందికి సువార్త అందింది? ఎందరి కోసం నా మాటలు ప్రభువుని గోజాడాయి? నా మాటలు నా కాన్స్టిట్యుయన్సీలో, నా ఇఐయఫ్‌లో, నా ఇయులో ఐక్యత తెచ్చాయి, సమాధానం తెచ్చాయి? (కీర్తన 35:28,37,30).

మాటలలో మరణం ఉంది, జీవం కూడా ఉంది (సామెతలు 18:21). నాలుక చాలా చెడ్డది దానిని అగ్నితోను విషంతోను పోల్చారు (యాకోబు 3:5-9). దానిని ఆత్మ దేవుని ద్వారా సాధు

చేయకపోతే మన బహుమానం పోయినట్లే; మన జీతం కరిగి పోయినట్లే.

### 3. ఉద్దేశాలు (1 కొరింథీ 4:5)

కొత్త నిబంధనలో క్రియలు కంటే ప్రధానమైనవి వాని వెనుక ఉండే ఉద్దేశాలు.

"కాబట్టి సమయం రాక మునుపు, అనగా ప్రభువు వచ్చు వరకు దేనిని గూర్చి తీర్పు తీర్చకుడి. ఆయన అంధకారమందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృదయంలోని ఆలోచనలను బయలు పరచునప్పుడు ప్రతి వానికి తగిన మెప్పు దేవుని వలన కలుగును".

మనుష్యులు బయటకు కనపడే బహిరంగ క్రియలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కానీ దేవుడు మన క్రియలను కొలిచేటప్పుడు వాటి వెనుక ఉన్న ఆలోచనను, ఉద్దేశాలను లెక్కలోనికి తీసుకొంటాడు. ఫలానా పని లేక మాట ఏ ఉద్దేశంతో చేశావు లేక చెప్పావు? ఫలానా సహాయం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటి? ఇవే దేవుడు లెక్కలోనికి తీసుకొనే అంశాలు. మనుష్యులు వీటిని పట్టించుకోరు. వారికి జరిగిన క్రియ మాత్రమే కనిపిస్తుంది. కాబట్టి మన క్రియలకు అగ్నిపరీక్ష ఈ ప్రాతిపదికలో జరుగుతుంది. మనం మనలను స్వపరీక్ష చేసుకొనేటప్పుడు ఒకసారి మన కార్యాలను మనం ఎందుకు చేస్తున్నామో ప్రశ్నించుకొని మనలను మనమే తీర్పు తీర్చుకోవడం ఉత్తమం.

### 4. ఆత్మఫలము (గలతీ 5:22)

మనుష్యులు బయట కనిపించే భక్తి కార్యాలను బట్టి ఆ వ్యక్తి యొక్క ఆత్మీయ అంతస్తును అంచనా వేస్తారు. ఆ వ్యక్తి మీటింగ్‌కు క్రమం తప్పకుండా వస్తాడా? దేవునికి ఎంత డబ్బు ఇస్తాడు? అనే వాటి మీద ఆధారపడి మన అంచనా ఉంటుంది. ఆ వ్యక్తి యొక్క ప్రార్థన, ఆరాధన, వాక్య పరిచర్య, బైబిల్ జ్ఞానం, ఆత్మ వరాలు ఇవన్నీ వారి ఆత్మీయ అంతస్తును అంచనా వేయడానికి సాధారణంగా మనం తీసుకొనే కొలరాళ్ళు. కానీ దేవుని కొల రాయితో ఇవన్నీ తేలిపోతాయి. దేవుని కొలత ఆ వ్యక్తి ఆత్మఫలము ఎంత అనే దానిపై ఆధారపడి ఉంటుంది. గలతీ 5:22 లోని తొమ్మిది లక్షణాలు క్రీస్తు ప్రభువు వారి గుణశీలాన్నీ చూపిస్తుంది. ఈ లక్షణాలు కేవలం ఆత్మదేవునితో సహవాసం కలిగి ఉన్న వ్యక్తులలో మాత్రమే కనిపిస్తాయి. దేవుడు విలువ ఇచ్చేది కూడా వీటికే. మత్తయి 7:19,20 లలో "మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలము వలన వారిని తెలిసికొందురు".

ఒక విశ్వాసి ఆత్మ సంబంధా లేక శరీర సంబంధా అనే విషయం ఆత్మఫలమును బట్టి తెలుస్తుంది. ఈ విషయాన్ని గురించి మనం స్వపరీక్ష చేసుకొనవద్దా? మనలో ఆత్మఫలం ముప్పదంతలా, అరువదంతులా, లేక నూరంతలా? మన ప్రేమ మానవ ప్రేమా? దైవ ప్రేమా? మనం చూపించేది సంతోషమా? ఆనందమా? లోకం ఇచ్చే శాంతా? ఆత్మ దేవుడు అనుగ్రహించే సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానమా? పంటి బిగువున చూపే దీర్ఘశాంతమా? ఆనందంతో కూడిన దీర్ఘశాంతమా? కాపరిలేని గొర్రెల్లాగా ఉన్న ప్రజలపై ప్రభువు చూపించిన దయాళుత్వమా? లేక బాధ్యత అప్పగి ంపబడింది కాబట్టి చేసే సువార్త పరిచర్యా? బయట కనపడే మంచితనమా? లేక అంతరంగం నుండి వచ్చే మంచితనమా? క్రియలు లేని మృత విశ్వాసమా? క్రియలతో కూడిన విశ్వాసమా? హాని చేసిన వారికి తిరిగి హాని చేయడానికి అవకాశం వచ్చినా కూడా నియత్రించుకొనే శక్తి గల సాత్వికమా? లేక పైపైకి ప్రశంస కోసం చూపించే నటనా? అసలు నిగ్రహం ఉందా? స్వపరీక్ష చేసుకొందాం.

### ముగింపు

ఆత్మదేవుని అధికారం క్రిందే క్రీస్తు ప్రభువు స్వరూపం విశ్వాసిలో నుండి కనబడుతుంది. మనలో ఆయన స్వరూపం ఎంత ఏర్పడింది? సంవత్సరం గడిచిపోతుంది? ఆయన రాకడలో ఆయనను ఎదుర్కొని ధైర్యంగా ఆయన ముందు నిల్చొనే సిద్ధపాటు ఉందా? ప్రతిరోజు, జీతం సంపాదించుకోవడానికి ఎన్నో అవకాశాలు అందిస్తుంది. స్వపరీక్షలో తేలిన లోటుపాట్లు సరిదిద్దుకొని పతనాలను పశ్చాత్తాపంతో ఒప్పుకొని ఆత్మదేవుని ప్రభుత్వం కింద విజయవంత మైన జీవితానికి "భళా, నమ్మకమైన మంచి దాసుడా" అని పిలవబడటానికి పథకాలను రచించుకొందాం, ప్రభువుకు సమర్పించుకొందాం.

– కె. దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు






# కమిట్‌మెంట్ విత్ గాడ్

ఈ నూతన సంవత్సరంలో అనేక కమిట్‌మెంట్స్ తీసుకొంటాం. చెడు అలవాట్లు మానతామనో, మరి ఎక్కువగా నీ సేవ చేస్తామనో, బైబిల్ క్రమంగా చదువుతామనో, మౌనధ్యానం క్రమంగా చేసుకుంటామనో, సువార్త ప్రకటిస్తామనో, నమ్మకస్తులుగా ఉంటామనో... ఇలా ఎన్నో రకాలుగా దేవునితో కమిట్ చేసుకుంటాం. దేవునితో మనం తీసుకొనే కమిట్‌మెంట్ ఏ స్థాయిలో ఉంటుందో, అది మన ఆత్మీయ స్థాయిని తెలియజేస్తుంది.

దేవుడు మనల్ని ఉప్పుగాను, వెలుగుగాను ఉండమన్నాడు. యేసు.. నేను లోకానికి వెలుగును అన్నాడు. మనల్ని వెలుగుగా ఉండమనడంలో తన స్థాయికి మనం రావాలని, ఆ అధికృత మనకిస్తున్నాడు. సూర్యుడు స్వయంగా ప్రకాశిస్తాడు. చంద్రుడు స్వయంగా ప్రకాశించడు. సూర్యకిరణాలు చంద్రుడిపై పడి ప్రతిబింబించినప్పుడు ఆ కిరణాలను మనం చూడగలుగుతాం. అలాగే మనం స్వయంగా ప్రకాశించలేము. యేసు కిరణాలు మనపై పడినప్పుడు మనం ప్రకాశిస్తాం. ఆయన లక్షణాలు మన జీవితంలో కనిపించినప్పుడు, అవి చీకటిని చీల్చే వెలుగుగా ఉంటాయి. అందుకనే మనం తీసుకునే నిర్ణయాలు మనపై ప్రభావాన్ని చూపిస్తాయి. మోషే దేవుని సన్నిధిలో గడిపి వెలుపలికి వచ్చినప్పుడు, అతని ముఖము ప్రకాశించింది. ప్రజలు ఆ వెలుగుని చూడలేని స్థితిలో అతడు తన ముఖముపై ముసుగు వేసుకోవలసి వచ్చింది (నిర్గమ 34:35). దేవుని సన్నిధి మన జీవితాలలో ఆయన ప్రకాశాన్ని ప్రతిబింబించగలుగుతుంది.

మన జీవితాలకు ఆదర్శంగా ఉండేలా దేవుని కొరకు తీసుకొన్న కొన్ని కమిట్‌మెంట్స్ చూద్దాం...

### 1. సేవచేయడానికి

“నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము” ఇవి యెహోషువ దేవుని సన్నిధిని, ఆయన నమ్మకత్వాన్ని రుచి చూచి అన్న మాటలు. యెహోషువని దేవుడు మోషే తరువాత నాయకునిగా చేశాడు. నిన్ను విడువను ఎడబాయను నిబ్బరము కలిగి ధైర్యముగా ఉండుమని ధైర్యపరిచాడు. నీవు అడుగుపెట్టే ప్రతి స్థలం నీకిస్తానని వాగ్దానం చేశాడు. యెహోవా ధర్మశాస్త్రాన్ని పఠించి, బోధించమన్నాడు. యెహోషువ దేవుని నమ్మకత్వాన్ని రుచి చూశాడు.

- యొర్దాను నది చీలితే పొడి నేల మీద ప్రజలను నడిపించాడు.
- ఏ ఆయుధం లేకుండానే యెరికో గోడలను కూల్చిన దేవుని శక్తి కళ్ళారా చూచాడు.
- శక్తికి మించిన యుద్ధాలు గెల్చాడు.

అన్నిటిని కలిపి ఆయన తీసుకొన్న నిర్ణయం... మీరు ఎవరిని సేవించినా నేనును నా ఇంటివారును యెహోవాను సేవించెదము. ఆయన సన్నిధి మనల్ని నిరంతరం ఆయనను సేవించే వారిగా ఉంచుతుంది. మహోన్నతుడైన దేవుని సేవించడంలో ఉన్న ధైర్యం, ఆనందం మరి దేనిలో ఉండదు.

### 2. పవిత్రత కొరకు

బాలుడైన దానియేలును, బానిసలా బబులోను రాజ్యానికి తీసుకెళ్ళిన తర్వాత పరాయి దేశంలో అతను దేవుని కొరకు పవిత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు.

రాజవంశానికి సంబంధించిన సకల విద్యా ప్రావీణ్యత కలిగిన బాలురను ఎంపిక చేసి వారికి రాజుగారి బల్ల వద్ద నుంచి తెచ్చిన ఆహారాన్ని ఇవ్వవలసిందిగా ఆజ్ఞ ఇచ్చాడు. అయితే దానియేలు, విగ్రహార్పితమైన ఆహారం తీసుకొని తన్నుతాను అపవిత్ర పరచుకోకూడదని నిర్ణయం తీసుకొన్నాడు.

దేవుడు నమ్మకస్తుడు. తనని మహిమపరచడానికి తీసుకొన్న నిర్ణయాన్ని బలపరుస్తాడు, తోడుగా ఉంటాడు. "తన యెడల యదార్థ హృదయము గలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది" 2 దిన 16:9. దేవుడు ఆశ్చర్యకరమైన కార్యాలు చేశాడు.

- ❖ నపుంసక అధిపతికి మనసులో దానియేలు పట్ల కనికరం కలిగేలా చేశాడు.
- ❖ దానియేలు తీసుకొన్న శాకాహారం అతన్నిని మిగిలిన వారికన్నా పదిరెట్లు ప్రకాశవంతం అయ్యేలా చేసింది.
- ❖ అందరికంటే అధిక జ్ఞానము కలిగిన వానిగా చేసింది.

దేవుని కొరకు తీసుకొన్న నిర్ణయాలు దేవుని మహిమపరచేవిగా ఉంటాయి, అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉంటాయి.

"... అయినను నీతిమంతులు విడువబడుట గాని వారి సంతానము భిక్షమెత్తుట గాని నేను చూచియుండలేదు" అనే దేవుని వాక్యాన్ని నమ్మి ధైర్యంగా ఉందాం (కీర్తన 37:25).

### 3. దేవునిని మహిమ పరచడానికి

దానియేలు వృద్ధుడైనా, దేవునితో ఉన్న నిబంధనలో మార్పు రాలేదు. రాజు గారి ఆజ్ఞ ప్రకారం నెలరోజుల వరకు ఎవరికీ ప్రార్థన చేయకూడదని తెలిసినా అతని అలవాటు ప్రకారం యెరూషలేము తట్టు కిటికీలు తెరచి ఉంచి రోజుకు మూడుసార్లు మోకాళ్ళ మీద ప్రార్థన చేశాడు. అతను రహస్యంగా, ఎదిరించే స్వభావంతో ప్రార్థన చేయలేదు. అలవాటుగా దేవునిని ఆరాధించాడు.

ఫలితంగా సింహాల గుహలో పడేశారు. అయితే నమ్మకమైన దేవుడు సింహాల నోళ్ళను మూయించాడు. రాజు రాత్రి నిద్రపోలేదు, భోజనం చేయలేదు. ఉదయం సింహాల గుహ దగ్గరకు వెళ్ళి "దానియేలూ... నీ దేవుడు నిన్ను రక్షించాడా" అని ఆతృతతో అడిగాడు. "రాజు చిరకాలము జీవించును గాక. రాజా నీ దృష్టికి నేను నేరము చేసినవాడను కాను గదా" అని అడిగిన మాటలు దానియేలు యొక్క సున్నిత స్వభావాన్ని చూపిస్తుంది. నా దేవుని దృష్టికి నిర్దోషినిగా కనబడడం వల్ల, ఆయన తన దూతను పంపించి సింహపు నోళ్ళను మూయించాడని చెప్పి దేవుని మహిమపరచాడు.

మన జీవితంలో దేవునిని మహిమపరచడం కోసం తీసుకొనే నిర్ణయాలు దేవుని శక్తిని బయలు పరుస్తాయి. రాజు దానియేలు దేవుడే నిజమైన దేవుడని ప్రకటించాడు.

మన జీవితాలు కూడా దానియేలులా పవిత్రంగా ఉండాలని, దేవుని మహిమపరిచే నిర్ణయము దేవుని శక్తిని నిరూపించేదిగా ఉండి అనేకమందికి సవాలుగా ఉంటుంది. మన జీవితాలలో భయం, అనుమానం, తరువాత చూద్దాం అనే లక్షణాలు మనలను దేవునిలో ఎదగనివ్వవు.దానియేలులా ధైర్యంగా ఉండు. అలాగే మన జీవితాలు మరి ఎక్కువగా దేవునికి దగ్గరవ్వాలని కోరుకొందాం.

### 4. పరిశుద్ధ జీవితం కొరకు

యవ్వనస్తుడైన యోసేపుపై కన్నువేసిన తన యజమానురాలు తనతో శయనించమని అడిగి నప్పుడు అతడు అన్నమాటలు మనం గుర్తుంచుకోవాలి (ఆది 39:9). "నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందును". పాపం దేవునికి వ్యతిరేకమైనది. మనం చేసే పాపం మొదట దేవునికి వ్యతిరేకం అనేది గుర్తుంచుకోవాలి. దేవునికి భయపడేవాళ్ళు, పాపం చేయడానికి భయపడతారు.

దేవుడు మనం పరిశుద్ధంగా ఉండాలని కోరుకొంటున్నాడు. "నేను పరిశుద్ధుడను కాబట్టి మీరును పరిశుద్ధులుగా ఉండుడి" అని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. పరిశుద్ధత లేకుండా ఎవ్వరూ దేవునిని చూడలేరు. అజాగ్రత్త, పాపం పట్ల చుల కనభావం మనల్ని పాపం వైపుకు లాగుతుంది. మన జీవితాలు పతనమైతే మనతోపాటు మనతోటి వారికి నిరుత్సాహం కలుగుతుంది. వారి జీవితాలను దేవునిలో ఎదగకుండా మనం అడ్డు బండలుగా ఉంటాం.

అందుకనే 'నీ యవ్వనేచ్ఛల నుండి పారిపో' అని పౌలు తిమోతికి చెప్పిన సలహా మన జీవితాలకూ వర్తిస్తుంది.

### 5. సువార్త ప్రకటన కొరకు

యేసుప్రభువును స్వరక్షకునిగా అంగీకరించిన మనకు పౌలు జీవితం సవాలుగా ఉండాలి.

యేసుప్రభును నమ్మిన వారిని నాశనం చేయడమే న్యాయమని భావించిన పౌలుకి, యేసు ప్రభువు దర్శనంతో తన జీవితం మారింది. సువార్త ప్రకటించడం కోసమే జీవించాడు.

- ❖ సువార్త గూర్చి సిగ్గుపడను.
- ❖ సువార్త ప్రకటించని యెడల నాకు శ్రమ.
- ❖ సువార్త ప్రకటించవలసిన భారము నాపై ఉన్నది.
- ❖ కొందరినైనా రక్షించవలెనని అందరికి అన్ని విధముల వాడనైతిని.

తన యోగ్యతలు, తన అవకాశాలు, తన అధికారాలు అన్ని పక్కకు పెట్టి దేవుని సువార్త కొరకు ప్రాణం పెట్టే వ్యక్తిగా మారాడు. బ్రతుకుట క్రీస్తే చావైతే మేలు అని మరణానికి దగ్గరలో ఉన్న పౌలు పలకడం, అతన్ని కాపలా కాయడానికి వచ్చిన సైన్యానికి సువార్త ప్రకటించి వారిని దేవునిలో నడపడం, ఇవన్నీ మనకు సవాలుగా నిలుస్తాయి.

సువార్త సేవలో అనేక కష్టాలు పడ్డాను. కొరడాదెబ్బలు, శ్రమ, బాధ, కరువు, వస్త్రహీనత, ఆకలిదప్పులు, దిగంబరత్వం... ఇన్ని కష్టాలలో కూడా క్రీస్తు ప్రేమ నుండి నన్ను ఏది ఎడబాపలేదని పౌలు చెబుతున్నాడు.

మన జీవితాల్ని పరిశీలిస్తే మనకు కష్టాలున్నాయా? మన కష్టకాలంలో దేవుని కొరకు సువార్త చెప్పే వ్యక్తులుగా ఉండగలమా? ప్రాణం పోయినా ఫర్వాలేదు గాని, సువార్తసేవను మానను అన్న నిర్ణయం ఈ నూతన సంవత్సర ఆరంభంలో తీసుకొందామా?

## 6. దేవునికి విధేయత చూపించడానికి

పేతురుని గుర్తు తెచ్చుకోగానే, ఆయన దుడుకు పేతురుగా, బొంకిన వానిగా గుర్తుకు వస్తాడు. యేసు ప్రభువుకు దగ్గరగా ఉండి ఆయన చేసిన అద్భుతకార్యాలు చూడడానికి ఆధిక్యత కలిగిన వానిగా అతనిని గుర్తించాలి. యేసు నేనెవరినని మీరు అనుకుంటున్నారని అడిగినప్పుడు 'సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని జవాబిచ్చాడు. "నీవు పేతురువి ఈ బండ మీద నా సంఘాన్ని కడతానని" ప్రభువు చెప్పారు. శిష్యులందరూ వెళ్ళిపోతుంటే... యేసు మీరు కూడా వెళతారా అని అడిగినప్పుడు పేతురు... "ప్రభువా ఎవరి దగ్గరకు వెళ్ళెదము, నీవే నిత్యజీవపు మాటలు గలవాడివి" అని చెబుతాడు.

పేతురు యేసుని ఎరుగనని ముమ్మారు బొంకడం ద్వారా అతని జీవితం ఉన్నత స్థాయి నుండి పతనమయింది. పునరుత్థానుడైన యేసు వచ్చి పేతురుని తన గొఱ్ఱెలను కాయుమని చెప్పిన తరువాత తన జీవితం మారింది.

పేతురు మొదటి ప్రసంగంలో 3 వేల మంది పురుషులు మారారు. పేతురుని యేసు నామంలో సువార్త ప్రకటించవద్దని ప్రధానయాజకులు పెద్దలు హెచ్చరిస్తే పేతురు చెప్పిన మాటలు ఆసక్తికరంగా ఉంటాయి. "దేవుని మాట వినుటకంటే మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పండి. మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక ఉండలేమని ఉత్తరమిచ్చిరి" (అ.కా. 4:19,20) అందుకు వారు బెదిరించి వదిలిపెట్టారు. దేవుడు బలపరిచే దేవుడు. వారు ప్రార్థన చేసే స్థలం కంపించినప్పుడు వారందరూ పరిశుద్ధాత్మతో నిండుకొనినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి (అ.కా. 4:31).

ఇలా దేవుని కొరకు తమ జీవితాలను కమిట్ చేసుకొన్న వాళ్ళు దేవుని మహిమను, దేవుని అద్భుతకార్యాలు వారి జీవితంలో జరగడం చూశారు.

కొత్త సంవత్సరంలో మనం దేవుని కొరకు తీసుకొనే మంచి నిర్ణయాలు కొన్ని రోజులకే పరిమితం చేస్తే, దేవుని శక్తిని మన జీవితంలో సంపూర్ణంగా చూడలేం.

**నూతన సంవత్సరంలో నీ కమిట్‌మెంట్ ఏంటి?**

దానియేలు వలె పవిత్రంగా
యోసేపు వలె పరిశుద్ధంగా
షద్రకు, మేషాకు, అబెద్నగోల వలె దేవుని
మహిమపరచడానికి
పౌలు వలె సువార్త చెప్పడానికి
పేతురు వలె దేవుని మాటకు
లోబడి యుండడానికి
మరియ వలె దేవునికి విధేయులై ఉండడానికి
యెహోషువ వలె దేవుని సేవించడానికి

మనం ఈ నూతన సంవత్సరములో నూతన నిర్ణయాలతో దేవునిని మహిమపరచే జీవితాలను కలిగియుందాం.

**– యం. జయనేంద్రకుమార్,** గుడివాడ

బైబిల్ స్టడీ

# అబ్రహాము- ప్రథమ ప్రాధ్యానత దేవునికే

**ఆది 22:1-19**



అనంతుడు, అద్వితీయుడైన దేవుడు, ఆదాము, నోవహు తరాల తర్వాత నూతనంగా మానవునితో సంబంధం పెట్టుకోవాలని, సహవాసం చేయాలని అనుకొని అబ్రహాముకు ప్రత్యక్షమయ్యాడు. అతని ద్వారా నూతన జనాంగాన్ని తీసుకొని రావాలనుకొని ఊరు అనే పట్టణం నుండి పిలుచుకొన్నాడు. దేవుడు అతనితో నీ తండ్రి ఇంటి నుండి, నీ బంధువుల యొద్ద నుండియు, నీ దేశమును విడిచి నేను చూపించు దేశానికి "వెళ్ళు" అని మాట్లాడాడు. అబ్రహాము దేవుని మాటకు విధేయత చూపించి హారాను వెళ్ళాడు.

ఊరు సుసంపన్నమైన పట్టణం. వ్యాపారం బాగా జరుగుతుంది. అబ్రహాము అతని కుటుంబం అన్య దేవతలను పూజించే వారు, వారి సంస్కృతిలో స్వదేశాన్ని, బంధువులను విడిచి వెళ్ళడం అనేది చాలా కష్టమైన పని. అయినా తన స్వదేశాన్ని విడిచి బయలు దేరి హారానుకు వెళ్ళాడు. సుఖవలయం నుండి బయటకు వస్తాడు. హారానులో దేవుడు మళ్ళీ మాట్లాడితే, హరాను నుండి బయలుదేరి కానాను వెళ్ళాడు. అప్పుడు దేవుడు, ఈ ప్రదేశాన్ని, నీకు, నీ సంతానానికి ఇస్తాను. నిన్ను ఆశీర్వదించి, అనేకుల ఆశీర్వాదానికి కారకునిగా చేస్తానని దేవుడు నూతనంగా నిత్య నిబంధన చేశాడు. అలాగే అబ్రహాముకు దేవుడు ఇస్సాకును వాగ్దాన పుత్రునిగా అనుగ్రహించాడు.

దేవుడు అబ్రహామును పరిశోధించాలనుకొని ఇస్సాకును బలిగా ఇవ్వమన్నాడు. దేవుడు ఎప్పుడు ఎవరినీ ఇలా అడుగలేదు. అబ్రహామును మాత్రమే అడిగాడు. అబ్రహాము ఇస్సానును బలి ఇచ్చే సమయంలో వద్దని, ప్రత్యామ్నాయంగా గొర్రెపిల్లను "బలి పశువుగా" ఇచ్చి యెహోవా యీరేగా నిరూపించుకొన్నాడు.

అబ్రహాము దేవునికి, ఆయన మాటకు విధేయత చూపించి తనను, తనకు కలిగినవి దేవునికి అర్పించి, 'మొదటి ప్రేమ, ప్రాధాన్యత దేవునికే' అని నిరూపించుకొన్నాడు. కొత్త నిబంధనకు పాత్రులుగా ఎంచబడిన మనం కూడా 'మొదటి ప్రేమ, ప్రాధాన్యత దేవునికే' ఇవ్వాలని కోరుకొంటున్నాడు.

ఘనతకు ముందు వినయముండును అనే వాక్యం అబ్రహాము జీవితంలో నెరవేరింది. అన్యుడైన అబ్రహామును దేవుడు తన అనంతమైన కృప చేత పిలిచి అనేకులకు తండ్రిగా, విశ్వాసంతో కూమారుని అర్పించి విశ్వాసులకు తండ్రి అయ్యాడు. అతని విధేయత, విశ్వాసం, నిరీక్షణ విశ్వాసులకు తండ్రిగా చేసింది.

## ప్రశ్నలు

**అప్రోచ్ ప్రశ్న:** ఎవరైనా ఒకరు మీకు ఒక గిఫ్ట్ ఇచ్చారు అనుకొండి. అది మీకు చాలా బాగా నచ్చింది, అయితే వాళ్ళు అదే గిఫ్ట్‌ను తిరిగి వెనక్కి ఇవ్వమని అడిగితే మీరు ఎలా ఫీలవుతారు?

1. దేవుడు ఎవరిని పిలిచాడు? అతనితో ఏమని చెప్పాడు? ఎందుకు దేవుడు అబ్రాహాముతో అలా చెప్పాడు? (1-2వ)
2. పరిశోధన అంటే ఏంటి? దాని ఉపయోగం ఏంటి?
3. అబ్రాహాము దేవుని మాటకు ఏ విధంగా విధేయత చూపించాడు? దహన బలి అంటే ఏంటి? (3-7-10వ)
4. ఇస్సాకుతో, సేవకులతో అబ్రాహాము ఏమని చెప్పాడు? ఎందుకు ఆవిధంగా చెప్పాడు? (5,7,8వ), దాన్ని బట్టి అబ్రాహాము గురించి మనం ఏమి అర్థం చేసుకోవచ్చు?
5. ఇస్సాకును బలి ఇవ్వడానికి అబ్రాహాము బలిని ఎలా సిద్ధం చేశాడు? (9-10వ) దేవుడు ఆ బలిని ఆపడానికి కారణం ఏంటి? దాన్ని బట్టి అబ్రాహాము గురించి ఏమి అర్థం అవుతుంది?
6. అబ్రాహాము విధేయతకు దేవుడు ఎలా ప్రతి స్పందించాడు? (15-18వ)
7. ఒక విశ్వాసిగా వేటిని ఎక్కువగా ప్రేమిస్తున్నాము? దేవుడు వాటిని వదిలివేయమంటే మన ప్రతిస్పందన ఏవిధంగా ఉండాలి?
8. త్యాగం చేయలేకపోవడానికి కారణాలు ఏంటి? త్యాగం చేయాలంటే మనలో ఉండాల్సిన లక్షణాలు ఏంటి?
9. మనం ఏ యే విషయాల్లో దేవునికి విధేయత చూపించాలి? విధేయత చూపించకలేక పోవడానికి కారణాలు ఏంటి?
10. ఈ కొత్త సంవత్సరంలో మొదటి ప్రాధాన్యత దేవునికి ఇవ్వడం నీ కిష్టమేనా?

*"మనం దేవున్ని మొదటి స్థానంలో ఉంచినప్పుడు, మిగతావన్నీ సరైన స్థానంలోకి వస్తాయి" - ఏ.టి. బెన్సన్*

**- తిరుమల సురేష్,** స్టాఫ్, గుంటూరు



# యేసు క్రీస్తు శిష్యులు

## భూలోకాన్ని తలక్రిందులు చేసినవారు



యేసుక్రీస్తు తన పరిచర్య ప్రారంభంలోనే ప్రార్థించి, తనకిష్టమైన పన్నెండు మందిని శిష్యులుగా ఏర్పరచుకొని వారు తనతో కూడా ఉండునట్లు, దయ్యములను వెళ్ళగొట్టే అధికారముగలవారై సువార్త ప్రకటించడానికి వారిని నియమించాడు (మార్కు 3:13). వీరిని గురించిన వివరాలు మత్తయి 10:2-4; లూకా 6:12-16లో చూస్తాము. ఈ పన్నెండు మంది కుటుంబ నేపథ్యం, సేవకైన వారి పిలుపు, క్రీస్తు పట్ల వారి నమ్మకం విభిన్నమైనవి. క్రీస్తు ఆరోహణం తర్వాత ఆయన ఆజ్ఞకు లోబడి పరలోక రాజ్యం సమీపించియున్నదని ప్రపంచానికి ప్రకటించారు. భూలోకాన్ని తలక్రిందులు చేసేవారిగా పేరు తెచ్చుకొన్నారు. యేసు తన శిష్యులకు 'అపోస్తలులు' అని పేరు పెట్టాడు. ప్రభువు నిమిత్తం దేవుని అధికారంతో, పరిశుద్ధాత్మ శక్తితో వారు చేసిన పరిచర్య వివరాలు అపోస్తలుల కార్యములుగా పిలువబడ్డాయి (అ. కా 1-12). ఆ పన్నెండు మంది క్రీస్తు శిష్యులను గూర్చిన కొన్ని విశేషాలను మనం గమనిద్దాం.

### 1. పేతురు

పేతురు అను మారుపేరు గల సీమోను, అతని సోదరుడు అంద్రెయ బెత్సయిదాకు చెందినవారు (యోహాను1:44). కానీ కపెర్నహూములో చేపలు పట్టే వృత్తిని చేసేవారు (మార్కు 1:29). పేతురు వివాహితుడు. సున్నతి పొందిన వారికి సువార్త ప్రకటించడానికి పిలువబడ్డాడు (గలతీ 2:7)

క్రీస్తు బంధించబడిన సమయంలో ఆయన ఎవరో తానెరుగనని బొంకిన పేతురుగా ప్రసిద్ధి చెందాడు. కానీ తాను బంధించబడి సిలువ వేయబడే తరుణంలో ప్రభువు వలె సిలువ వేయబడడానికి తాను అర్హుడను కాదని తనను తలక్రిందులుగా సిలువ వేయాలని కోరాడు (యోహాను 21:15-19). ఆదిమ సంఘంలో పేతురు గొప్ప నాయకుడుగా సంఘాన్ని స్థిరపరిచినట్లు దేవుని వాక్యం వివరిస్తుంది.

### 2. అంద్రెయ

అంద్రెయ మొదట బాప్తీస్మమిచ్చు యోహాను శిష్యుడిగా ఉన్నాడు. 'ఇదిగో, దేవుని గొర్రెపిల్ల'

(యోహాను 1:36) అని యోహాను ప్రకటిస్తున్నప్పుడు యేసును అనుసరించిన మొదటి వ్యక్తి అంద్రెయ. తన సహోదరుడైన పేతురుకు యేసును పరిచయం చేయాలనే ఆయన కోరిక, దేవుని పట్ల ప్రగాఢ ప్రేమను, ఇతరులకు దేవునిని పరిచయం చేయాలనే ఉత్సాహాన్ని తెలియజేస్తుంది. అంద్రెయకు పేతురు వలె గొప్ప నాయకత్వ లక్షణాలు లేనప్పటికీ వ్యక్తిగతంగా సువార్తను ఇతరులకు పంచుకోవడంలో ఆసక్తిగలవాడు. అంద్రెయ గ్రీసు, చిన్న ఆసియా, ప్రాంతాల్లో ప్రకటించాడని, రోమన్ గవర్నర్ ద్వారా **X** ఆకారంలో సిలువ వేయబడి మరణించాడని కొన్ని కథనాలు తెలియజేస్తున్నాయి.

### 3. యాకోబు

యాకోబు జెబెదయి కుమారుడు, యేసుకి సన్నిహితంగా ఉండే ముగ్గురు శిష్యులలో ఒకడిగా ఉన్నాడు. యేసు చనిపోయిన యాయీరు కుమార్తెను లేపినప్పుడు (మార్కు 5:37), రూపాంతర సమయంలో (మత్తయి 17:1), గెత్సేమనే తోటలో (మార్కు 14:33) యాకోబు కూడా ఉన్నాడు. యాకోబు తల నరికి వేయబడి, హతసాక్షిగా మరణించిన (అ.కా12:2) తొలి శిష్యునిగా గుర్తించబడ్డాడు.

### 4. యోహాను

యోహాను 'యేసు ప్రేమించిన శిష్యుని'గా పిలువబడ్డాడు. పేతురు, యాకోబులతో పాటు ఇతడు కూడా అంతర్గత శిష్యునిగా ఎంచబడ్డాడు. యోహాను 1,2,3, మరియు ప్రకటన గ్రంథ రచయిత కూడా ఇతడే. ఈయన ఎక్కువగా యేసు ప్రేమను గురించి తన రచనలలో తెలియజేశాడు. అవి యేసుతో ఆయనకు గల సాన్నిహిత్యాన్ని, ప్రేమను వివరిస్తాయి. పత్మాసు ద్వీపంలో ఖైదీగా ఉన్న తర్వాత ఎఫెసుకు తిరిగి వచ్చి ఆసియా ఖండం అంతటా అనేక సంఘాలను స్థాపించి క్రీ.శ. 100లో మరణించాడని చరిత్ర తెలియజేస్తుంది.

### 5. ఫిలిప్పు

"మరునాడు ఆయన గలిలయకు వెళ్ళగోరి ఫిలిప్పును కనుగొని నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను." (యోహాను 1:43). ఫిలిప్పు బేత్సయిదాకు చెందినవాడు. అతడు యూదుడు, ఫిలిప్పు అనేది అతని గ్రీకు పేరు. సువార్త ప్రకటనకు మక్కువ చూపే ఫిలిప్పు బహుశా తన సన్నిహితులతో కలిసి లేఖనాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఉంటాడు. అతడు నతనయేలుతో మోషే ప్రవచించిన ప్రవక్త లభించాడని చెప్పడం ఇందుకు నిదర్శనం (యోహాను 1: 45). నతనయేలును యేసుకు పరిచయం చేశాడు (యోహాను 1:45) యోహాను సువార్తలోని కొన్ని సన్నివేశాలలో(యోహాను 6:5-7; 12: 21-22; 14:8-9) ఫిలిప్పు కనిపిస్తాడు. కొన్ని కథనాలు ఫిలిప్‌ను ఫ్రిజియాలోని హిరాపోలిస్‌లో రాళ్ళతో కొట్టి సిలువ వేశారు.

### 6. బర్తొలొమయి

బర్తొలొమయి అనికూడా పిలువబడే నతనయేలు కానా నుండి వచ్చాడు. 'నజరేతులోనుండి మంచిదేదైనా రాగలదా?' అని అతడు నజరేతు గురించి స్థానికంగా కొంత దురభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు (యోహాను 1:46). యేసు అతనికి దేవునిపై గల ప్రేమను గుర్తించాడు (యోహాను1:47). అర్మేనియాలోని అల్బినో పోలిస్ ప్రజలకు సువార్త ప్రకటిస్తుండగా అతడిని కొట్టి సిలువ వేశారు.

### 7. మత్తయి (లేవీ)

అల్ఫయి కుమారుడైన మత్తయి (లేవీ) పన్నులు వసూలు చేసేవాడు. వీరిని ఇశ్రాయేలీయులు ఎంతో ద్వేషించేవారు. రోమా ప్రభుత్వానికి చెల్లించడానికి, వారి స్వంత జేబులు నింపుకోవడానికి వీరు అధిక మొత్తంలో డబ్బును తీసుకొనేవారు. యేసు పన్నులు వసూలు చేసేవారితో, పాపులతో కలిసి ఉన్నట్లుగా చెప్పబడింది (మార్కు 2:16). యేసు మత్తయితో తనను అనుసరించమని చెప్పినప్పుడు అతడు లేచి ఆయనను అనుసరించాడు (మత్తయి 9:9).

మత్తయిని ఇథియోపియా, ఈజిప్ట్ దేశాలకు తీసుకొని వచ్చాడు. హిర్కానస్ అనే రాజు అతన్ని ఈటెతో పొడిచి చంపినట్లుగా చరిత్రకారులు వివరిస్తారు.

### 8. తోమా

దిదుమ అనబడిన తోమా ఎంతో సందేహాస్పద వ్యక్తిగా కనిపిస్తాడు. 'దిదుమ' అనగా జంట. బహుశా అతనికి కవల సోదరుడు ఉండి ఉండవచ్చు. లాజరు చనిపోయిన సమయంలో, బేతనియకు తిరిగి వెళ్ళాల్సిన సమయంలో "తోమా ఆయనతో కూడా చనిపోవడానికి మనము కూడా వెళ్దామని



తనతోటి శిష్యులతో చెప్పాడు" (యోహాను 11:16) ఈ మాటలలో క్రీస్తుపట్ల తనకున్న విధేయత, ధైర్యాన్ని చూడ గలము. యోహాను 14:4,5 వచనాలలో క్రీస్తును అడిగిన ప్రశ్న ద్వారా అతని భక్తి ప్రదర్శించబడింది. యోహాను 20:28లో పునరుత్థానుడైన యేసును నమ్మే ముందు స్పృశించి చూడాలని ఆశపడ్డాడు.

తోమా భారతదేశానికి వచ్చి సంఘాన్ని కట్టాడని, ఈటెలతో పొడవబడి మరణించాడని చెప్పబడుతుంది.

### 9. అల్ఫయి కుమారుడైన యాకోబు

యాకోబు తండ్రి అల్ఫయి(లూకా 6:15), తల్లి మరియ, సోదరుడు యోసేపు (మత్తయి 27:56). అతని గురించిన కుటుంబ వివరాలు కొన్ని తప్ప మరే విషయాలు పేర్కొనబడలేదు. సీనాయి వద్ద ఆయనను సిలువ వేసినట్లుగా లేదా యెరూషలేము లో రాళ్ళతో కొట్టి చంపినట్లుగా బైబిల్ పండితులు తెలియజేస్తారు.

### 10. జెలోతే అనబడిన సీమోను

ఈయన్ని క్వనీయుడైన సీమోను అని కూడా పిలుస్తారు. అరమిక్ భాషలో 'క్వనాస్' అనే పదానికి 'దృఢమైన భక్తిగలవాడని'అర్థము.ఇతడు జెలోతే అనే గుంపునకు చెందినవాడు (మత్తయి 10:4, మార్కు 3:18).మత్తయి 4:18-22 ప్రకారము ఇతడు కూడా శిష్యత్వపు పిలుపును అందుకొన్నాడు.

ఆఫ్రికా పశ్చిమ తీరంలో బోధించిన తరువాత ఇంగ్లాండ్ దేశానికి వెళ్ళాడని, క్రీ.శ 74 లో అక్కడ సిలువ వేయబడ్డాడని చరిత్ర వెల్లడిస్తుంది.

### 11. యాకోబు కుమారుడైన యూదా

మత్తయి సువార్తలో'తద్దయి' అను మారు పేరు గల 'లెబ్బయి' అని ఇవ్వబడింది( మత్తయి 10:3), మార్కు సువార్తలో తద్దయి అని పిలిచారు (మార్కు 3:18), లూకా సువార్తలో యాకోబు కుమారుడగు యూదా (లూకా6:16; అ. కా 1:13) అని ఇతని గూర్చి చెప్పబడింది.

పెంతెకోస్తు తర్వాత యాకోబు కుమారుడైన యూదా సువార్తను ఎడెస్సా దేశానికి తీసుకెళ్ళాడు. అక్కడ అనారోగ్యంతో ఉన్న ఆదేశపు రాజును స్వస్థపరిచాడు. ఎడెస్సాలోని చరిత్ర గ్రంథాలలో యూదా సందర్శన, అతడు చేసిన వైద్యం యొక్క రికార్డులను గురించి 'యుసేబియస్' అనే చరిత్రకారుడు తెలియజేశాడు. అతడు తన విశ్వాసాన్ని బట్టి 'అర్డేజ్' అనే స్థలములో హత్య చేయబడ్డాడని ఇతని యెముకలు అనేక స్థలాలకు పంపబడ్డాయని చెప్పబడుతుంది.

### 12. ఇస్కరియోతు యూదా

యూదా కుటుంబ నేపథ్యం గురించి ఇవ్వబడలేదు. ఇతడు బహుశా 'కెరియోత్' (యూదాలోని ప్రాంతం) నుండి వచ్చిన వ్యక్తి కావచ్చు. కోశాధికారిగా ఉండి డబ్బును దొంగిలించేవాడు (యోహాను 12:6). తనకు ద్రోహం చేస్తాడని తెలిసినప్పటికీ, యేసు తన శిష్యులలో ఒకనిగా ఎంచుకున్నాడు (యోహాను 6:70-71).యూదా మూడు సంవత్సరాలు యేసుతో గడిపాడు కాని తన హృదయాన్ని యేసుకు ఇవ్వలేదు. ముప్పై వెండి రూకల కొరకు యేసును అప్పగించి తన గురువుకు ద్రోహం చేసిన శిష్యునిగా (మత్తయి 26:15) చరిత్రలో నిలిచిపోయాడు.

మత్తయి 27:8; అ. కా 1:19 ప్రకారము ఉరి పెట్టుకొని తన జీవితమును ఓటమితో ముగించినట్లు తెలుస్తుంది. ఇతని స్థానంలో మత్తీయ 12వ శిష్యునిగా ఎంపికయ్యాడు. మత్తయి 19:28 లో యేసు చెప్పిన మాట ప్రకారం మత్తీయ పన్నెండవ అపోస్తలునిగా ఎంపిక చేయబడ్డాడు.

### ముగింపు

విలక్షణమైన, వైఫల్యాలున్న సాధారణ వ్యక్తులను అసాధారణమైన వ్యక్తులుగా, అసాధారణమైన మార్గంలో దేవుడు ఎలా ఉపయోగించుకొంటాడో, ఈ పదకొండు మంది యేసు శిష్యుల జీవితాల ద్వారా తెలుసుకోవచ్చు. ఆధ్యాత్మిక అజాగ్రత్త, అవకాశాన్ని వృథా చేయడం, పాపపు ఇచ్ఛలు, హృదయ కాఠిన్యం కలిగిన ఇస్కరియోతు యూదా జీవితం విశ్వాసులందరికీ ఒక హెచ్చరికగా నిలుస్తుంది.

- రూత్ వినయ్,
ప్రగతినగర్, హైదరాబాద్

## బానిస బాలిక

# బ్లాండీనా

నాలుగు వేల మంది గ్రాడ్యుయేట్స్ ఒక సంవత్సరమంతా కష్టపడి రెండు వేల మంది విద్యార్థులను క్రీస్తు కొరకు సంపాదించడం ఎంతో కష్టంగా అనిపిస్తుంది. యంపిసి, ఇబియస్, బిబియస్ గాస్పల్ ఈవినింగ్స్, ఇ-క్యాంప్స్ రకరకాల పద్ధతులు, టూల్స్, టెక్నాలజీలు వాడుతున్నా మనం అనుకొన్న ఫలితాలు పొందలేక పోతున్నాము. కానీ ఇవేమీ అందుబాటులో లేని రోజుల్లో పదిహేను సంవత్సరాల బాలిక ఒక్క రోజులోనే ఇరవై అయిదు వేల మందిని ప్రభువులోనికి నడిపించింది. క్రీస్తు శకం 177వ సంవత్సరంలో ఈ సంఘటన జరిగింది.

ఈ విషయం నమ్మశక్యం కానట్లు ఉన్నా ఇది చారిత్రక సత్యం. క్రీ.శ.260-339 మధ్య కాలంలో జీవించిన యూసిబియస్ తన హిస్టోరి యా ఎక్లెసియాస్టికాలో ఈ సంఘటనకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి చరిత్రను భద్రపరిచాడు.

క్రైస్తవులు సమావేశమైనప్పుడు నరమాంస భక్ష్యం, వ్యభిచారానికి పాల్పడుతున్నారని మొదటి రెండు శతాబ్దాలలో క్రైస్తవుల గురించి ఒక తప్పుడు పుకారు పుట్టించారు. ఎందుకంటే ఆదిమ సంఘంలో యేసు క్రీస్తును నమ్ముకొన్న వారు ఆయన కొరకు బలముగా సాక్ష్యమివ్వడం, పరిశుద్ధాత్మ దేవుడు సంఘంలో బలంగా పనిచేయడం వలన సంఘం దిన దినం విస్తరిస్తుంది. ఒక క్రైస్తవుని చంపితే అతడు భూమిపై ఒలికించిన ప్రతి రక్తపు బొట్టునుండి మరో విశ్వాసి పుడుతున్నాడు. ఈ సంఘటనలు చక్రవర్తులను, పాలకులను కలవరానికి గురిచేస్తున్నాయి. ఈ సంఖ్య ఇలానే విస్తరిస్తే వారి అధికారానికి, రాజరికానికి ముప్పని భావించారు. అంతే కాదు క్రైస్తవులు విగ్రహారాధన చేయరు, విగ్రహాలకు మొక్కరు. అందువలన వారి దేవతలకు కోపం వచ్చి తెగుళ్ళు, కరువులు, యుద్ధాలు వస్తాయి అనే భయముండేది.



అందుకే వారి మీద ఎన్ని నేరాలు మోపొచ్చో, అన్ని నేరాలు మోపి వారిని సమూలంగా భూమిపై లేకుండా చేయాలని చూశారు.

ప్రస్తుతం ఫ్రాన్స్‌గా పిలవబడుతున్న దేశంలో లియోన్ అనే పట్టణం మూడవ అతి పెద్ద పట్టణం. ఇక్కడ అంఫిథియేటర్ అనే ఒక స్టేడియం ఉండేది. క్రీస్తు కొరకు బహిరంగంగా సాక్ష్యమిచ్చిన వారిని బంధించి అతి దారుణంగా హింసించి ఇక్కడ చంపేవారు.

ఖర్కోటక పాలకుడు మార్కస్ ప్రతి రోజూ 10 నుండి 15 మందిని చిత్రహింసలు పెట్టి చంపి ఆనందించేవాడు. కొన్ని వేల మంది కూర్చొని ఈ దృశ్యాలను చూసే విధంగా బహిరంగంగా చంపేవారు. ఈ సంఘటనను చూసిన వారు ఎవ్వరూ భయంతో యేసును దేవుడు అని చెప్పకూడదు. అది వారి ఉద్దేశం.

ఈ పట్టణంలో ఎక్కువ మంది ధనికులు ఉండేవారు. వారు బానిసలను కొని వారితో వెట్టిచాకిరి చేయించుకునే వారు. అందులో ఒక సంపన్నురాలు ప్రభువైన క్రీస్తు నందు విశ్వాసముంచింది. అంతమాత్రమే కాదు క్రీస్తు కొరకు బతుకుతూ అనేకులకు క్రీస్తును పరిచయం చేయాలనే ఆశ ఉండేది. తనవద్ద బానిసలుగా ఉన్న వారికి కూడా క్రీస్తును పరిచయం చేసింది. విశ్వాసం ఉంచిన వారందరూ ఒకరోజు దేవుడ్ని ఆరాధిస్తూ ఉండగా సైనికులు ఒక్కసారిగా వచ్చి వారిని బంధించి తీసుకెళ్ళారు. అలా బంధించబడిన వారిలో 15 సంవత్సరాల వయసుగల ఒక బానిస కూడా ఉంది ఆమె పేరే బ్లాండీనా. ఆ రోజు మొత్తం 20 మందిని బంధించారు.

సైనికులు వారిని బంధించి తీసుకొని వెళ్తున్నప్పుడు బ్లాండినాను చూసిన వారందరూ జాలిపడ్డారు.

ఎందుకంటే తన శరీరం చాలా బలహీనంగా ఉండేది. చిత్రహింసలు పెట్టకముందే మార్గమధ్యంలోనే చనిపోతుంది అనుకొన్నారు. కానీ 17 రోజులు చిత్రహింసలు పెట్టినా చనిపోలేదు. బ్లాండీనాతో రెండు మాటలు అనిపించాలని చాలా హింసించారు కానీ అనిపించ లేకపోయారు. ఒకటి 'యేసు' దేవుడు కాదని, రెండో మాట తన యజమానురాలు మంచిదికాదని. బ్లాండీనాతో తన యజమానురాలు మంచిది కాదు అని ఒప్పించి ఆమెను కూడా బంధించి క్రీస్తు సువార్తను ప్రకటిస్తున్నందుకు చంపాలని అనుకొన్నారు.

అక్కడ లియోన్ పౌరులను చంపాలంటే బలమైన సాక్ష్యం కావాలి. ఈ యజమానురాలే అక్కడ సువార్తకు కేంద్రబిందువని వారికి తెలుసు. అందుకే ఆమెపై చెడ్డ నేరం మోపి చంపాలని వారి ప్రయత్నం. కానీ ఎన్ని చిత్రహింసలకు గురిచేసినా బ్లాండీనా క్రీస్తు దేవుడు కాదు అని, తన యజమానురాలు చెడ్డ వ్యక్తి అని ఒక్క మాట కూడా చెప్పలేదు. అలా చెప్పకపోగా, క్రైస్తవులు పరిశుద్ధులు, వారు చెడు కార్యములు చేయరు, యేసే దేవుడు అంటూ సాక్ష్యమిచ్చింది. మహా కోపావేశుడైన మార్కస్ బ్లాండీనాను చంపమని ఆజ్ఞాపించాడు.

అంఫిథియేటర్‌లో ఒక పెద్ద దూలానికి ఆమెను బంధించి వేలాడదీశారు. ప్రజలతో ఆ స్టేడియం మొత్తం నిండి పోయింది.

బాగా ఆకలితో ఉన్న 30 నుంచి 40 సింహాలను ఒక్కసారిగా బ్లాండీనా మీదకు వదిలారు. ఆరోజు దానియేలు సింహాల బోనులో ఏమి జరిగిందో ఏ మానవుడు చూడలేదు. కానీ ఇక్కడ కొన్ని వేల మంది ప్రజలు ఆరోజు ప్రత్యక్షంగా చూస్తున్నారు. స్టేడియంలో కూర్చున్న ప్రజలు నిశ్శబ్దంగా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. కొందరు ఈ ఘోర దృశ్యం చూడలేక కళ్ళు గట్టిగా మూసుకొని ఉన్నారు. బ్లాండీనా మౌనంగా దేవునిని స్తుతిస్తూ, స్తెఫను వలే ప్రార్థిస్తుంది. మరణ భయం, చింత ఆమెలో కొంచెం కూడా కనిపించడం లేదు. యేసు క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించిన రోజే అవసరం అయితే తనకోసం ప్రాణమిచ్చిన ప్రభువు కోసం తిరిగి ప్రాణమివ్వాలని తనకు తెలుసు. అందుకే తన ప్రాణం ఇవ్వడానికి సిద్ధపడిందే గానీ విశ్వాసాన్ని ఎక్కడా విడిచి పెట్టలేదు.

గాండ్రిస్తూ వచ్చిన సింహాలు కొయ్యకు వేలాడుతున్న బ్లాండీనా పాదాలను ముద్దాడినట్లుగా నాకుతూ అక్కడే మోకరించినట్టు చతికిలబడి పోయాయి. విచిత్రం... ఏం జరుగుతుందో ఎవ్వరికీ తెలియడం లేదు. సింహాలు మాత్రం దానియేలు వద్ద మౌనంగా ఉన్నట్లు ఆకలితో అలానే ఉండిపోయాయి. స్టేడియంలో కూర్చున్న వారి ఆశ్చర్యానికి అంతులేదు. యేసుక్రీస్తు మహిమను ఆరోజు వారందరూ కన్నులారా చూశారు. అక్కడితో బ్లాండీనాను వారు విడిచి పెట్టలేదు. ఏ ఒక్క సింహం అయినా ఆకలితో ఆమెను చంపి తినకుండా ఉంటుందా అని వారు 9 గంటలు వేచి చూశారు. కానీ సింహాలు అన్నీ అది దేవుని ఆజ్ఞ అన్నట్లు మౌనంగా ఉండిపోయాయి. వారికి ఏం చేయాలో తోచక ఒక ఇనుప కుర్చీని ఎర్రగా కాల్చి బలవంతంగా ఆమెను ఆ కుర్చీపై కూర్చోబెట్టారు. శరీరం కాలిపోయి మహా వేదనతో కేకలు వేస్తున్న బ్లాండీనా మీదకు ఒక దున్నపోతును విడిచిపెట్టారు. అది పరుగున వచ్చి రెండు కొమ్ములతో బ్లాండీనాను ఆ మంటల్లోకి ఎత్తి పడేసింది. అందరి కళ్ళముందు బ్లాండీనా కాలిపోయింది. కానీ తన విశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు, కాలిపోలేదు నేటికీ బ్లాండీనా చరిత్ర సజీవంగా ఉంది.

బ్లాండీనా అందరికీ సిలువలో ప్రభువువలే కనిపించింది. రెండు నిమిషాల తర్వాత ప్రజలందరూ లేచి నిలబడ్డారు. పరిశుద్ధాత్మ దేవుడు వారిమధ్య పని చేశాడు. అందరూ చేతులు పైకి ఎత్తి బ్లాండీనా దేవుడే నిజమైన దేవుడు అని గొప్ప స్వరంతో దేవునిని స్తుతిస్తూ యేసుని వారి స్వంత రక్షకునిగా స్వీకరించారు. ఆ రోజు విశ్వసించిన వారు సుమారు ఇరవై అయిదు వేలమంది.

ఈ సంఘటన చదివిన తరువాత మనం మారుమనస్సు పొందడం మాత్రమే కాదు గానీ క్రీస్తు కొరకు బ్లాండీనా వలే సమర్పించుకోక పోతే ఆత్మలను మనం గెలుచుకోలేము అన్నది నిజం అనిపిస్తుంది. విశ్వాసం, సమర్పణ ద్వారానే దేవుని కొరకు గొప్ప కార్యాలు చేయగలం అని బ్లాండీనా జీవితం నుంచి నేర్చుకోవచ్చు. అటువంటి విశ్వాసం సమర్పణతో మనం కొనసాగుటకు దేవుడు మనకు తన కృప అనుగ్రహించుగాక..

**– కె. ఆదం,** చింతలపూడి



# సంభాషణ సరైనదేనా?

వివాహ జీవితంలో మూడు రకాల సంభాషణలు జరుగుతూ ఉంటాయి. మనం అందరం ఏదో ఒక రకాన్ని ఉపయోగిస్తూ ఉంటాము. వాటిని క్లుప్తంగా తెలుసుకొందాం.

### 1. చొరవ తీసుకొని సంభాషించడం

సంభాషించడంలో ఇది సరైన విధానం. ఈ సంభాషణ విధానంలో పరిస్థితి తీవ్రం కాకమునుపే చొరవ తీసుకొని మాట్లాడటం జరుగుతుంది. వైవాహిక జీవితంలో కలసి డబ్బును అనేక అవసరాల కోసం ఖర్చుచేయబోతున్నారు కాబట్టి ఇద్దరూ కలసి కూర్చొని చర్చించుకొంటారు. పిల్లల్ని ఎలా పెంచాలి, ఏ యే ప్రాధాన్యతలను ఏర్పరచుకోవాలి మొ॥ విషయాలను చర్చించుకొని ప్రణాళికలను ఇద్దరూ కలసి రూపొందించుకొంటారు. చొరవ తీసుకొని సంభాషించడం, ఒక ఒప్పందానికి రావడం అనేవి వైవాహిక జీవితంలో ఐక్యతకు, శాంతి సమాధానాలకు మూలం.

### 2. ప్రతిస్పందన

చొరవ తీసుకొని సంభాషించే లక్షణం లేకపోతే ఎల్లప్పుడూ ప్రతిస్పందించే వ్యక్తివిగానే నీవు ఉంటావు. నీ భార్య/భర్త డబ్బును ఖర్చుచేస్తున్నప్పుడు, అతడు/ఆమె రిమోట్ కంట్రోల్ చేస్తున్న విధానం నచ్చనప్పుడో లేదా మరొక సందర్భంలోనో నీవు ప్రతిస్పందిస్తుంటావు. చొరవతీసుకొని సంభాషించడం అనేది లేకపోతే మీరు ఒకరికొకరు ప్రతిస్పందిస్తుంటారు. అప్పుడు మాటకు మాట పెరుగుతుంది. తద్వారా వీరు ఎల్లప్పుడూ పోట్లాడుకొంటుంటారు.

### 3. రేడియోలా స్పందించడం

ఈ మూడింటిలో ఇది హీనమైన సంభాషణ. నీ జీవిత భాగస్వామి బాధపడతారని కొన్ని విషయాలను ప్రస్తావించకుండా ఉండే ఈ రకమైన సంభాషణను రేడియోలా స్పందించడం అంటారు. ఏం మాట్లాడితే ఎలాంటి ప్రతిస్పందన వస్తుందో అన్న భయం లేకుండా నీ భాగస్వామి ప్రతి విషయం నీతో ప్రస్తావించగలిగే స్వేచ్ఛను, హక్కును నీవు ఆమె/అతనికి ఇవ్వాలి.

### విజయవంతమైన సంభాషణ

నీ జీవిత భాగస్వామి నీలాంటివారుకాదు అన్న విషయాన్ని నీవు గుర్తుంచుకోవాలి. విజయవంతమైన సంభాషణకు ఇది చాలా ప్రాముఖ్యం. మీకు అవసరమైనవి వారికి అవసరం ఉండకపోవచ్చు. మీరు విన్నట్లు వారు వినకపోవచ్చు. మీరు పురుషుడైతే, మీ భార్యలో భద్రతా భావం కలిగేటట్లు ఆమెతో మాట్లాడండి. అప్పుడు మీ సంభాషణ విజయవంతమైన సంభాషణ అవుతుంది. మీరు స్త్రీ అయితే, గౌరవంతో కూడిన మాటలతో మీ భర్తతో సంభాషించండి. మీరు మీ భర్తతో సమానులు. ఏదైనా

ఆయనతో పంచుకోవచ్చు. మంచి సంభాషణతోనే మీ బంధం బలపడుతుంది. సంభాషణలో ఎక్కువసమయం గడపడం ద్వారా మీరు ఒకరి నొకరు అర్థంచేసుకొంటారు. మీ వివాహ బాంధవ్యం మంచిగా ఉండాలంటే, మంచి మాటలతో కూడిన సంభాషణ చాలా అవసరం. సంభాషణ లేకపోతే నీ జీవిత భాగస్వామిని నీవు సరిగా అర్థంచేసుకోలేవు.

## స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాలు

పురుషులు గౌరవాన్ని కోరుకొంటారు. స్త్రీలు నిష్కపటమైన, సహనం, నిజాయితీ, ప్రేమాభిమానాలతో కూడిన సంభాషణను కోరుకొంటారు. సమాచారాన్ని చేరవేయడానికే పురుషులు సంభాషిస్తారు. తమ భావోద్వేగాలు వ్యక్తం చేయడానికి స్త్రీలు సంభాషిస్తారు. ఒక సర్వే ప్రకారం పురుషులు రోజుకు సగటున 7000 పదాలు ఉపయోగిస్తే, స్త్రీలు 21,000 పదాలు ఉపయోగిస్తారు.

స్త్రీలు భావోద్రేక విషయాలలో తొందర పడతారు అంటే వారు ఇతరులతో అనేక విషయాలు వెనకాముందు ఆలోచించకుండా చెప్తారు. పురుషులు భావోద్రేక విషయాలలో తొందరపడరు. వీరు భావోద్రేక సంబంధమైన విషయాలు ఎవ్వరితోను చెప్పరు. వారు ఇతరులతో సంభాషించే సందర్భంలో చాలా జాగ్రత్త వహిస్తారు.

పురుషులు మనసు విప్పి మాట్లాడుతున్నప్పుడు, భార్యలు శ్రద్ధగా వినాలి. ఎందుకంటే పురుషులు ఈ సందర్భంలో చాలా సున్నితంగా ఉంటారు. వారు మనస్సు విప్పి మాట్లాడుతున్నప్పుడు స్త్రీలు ఎగతాళిగా మాట్లాడినా, విమర్శించినా, తక్కువ చేసి మాట్లాడినా, పురుషులు మాట్లాడడం ఆపేస్తారు. భావోద్రేకపరంగా పురుషులు స్త్రీలు ఉన్నంత బలంగా ఉండరు. కాబట్టి స్త్రీలు తమ భర్తలను గౌరవించాలి. తాను చెప్పే ప్రతిమాటను తన భార్య శ్రద్ధగా వింటుంది అన్న భావం భర్తలో కలిగే విధంగా భార్యలు జాగ్రత్తపడాలి. తాను మనసు విప్పి మాట్లాడుతున్న సమయంలో భార్య భర్తను విమర్శించడానికి దాన్ని అవకాశంగా తీసుకోకూడదు, వాటిని వేరేవాళ్ళకు చెప్పకూడదు. ఆ మాటలను ఆసరాగా తీసుకొని తర్వాత ఎత్తిపొడుపు మాటలు మాట్లాడకూడదు.

పురుషులు గౌరవాన్ని కోరుకొంటారని మనం ఇంతకుముందు చూశాం. ఇది వారి ఇగో/అహం అనుకోకూడదు. దేవుడు వారిని అలా సృజించాడు అంతే. అదే స్త్రీలయితే, తమ భర్తలనుండి శ్రద్ధ, భద్రతను కోరుకుంటారు. దేవుడు వారిని అలా సృజించాడు. భర్త ప్రేమా, ఆప్యాయతలతో కూడిన మాటలు పలుకుతుంటే భార్య చాలా సంతోషంగా ఉంటుంది. అదే భర్త పెడగా మాట్లాడుతుంటే భార్య చాలా అభద్రతా భావంలోకి వెళ్తుంది. తర్వాత అతను ఎంత ప్రయత్నించినా తన భార్యను నెమ్మది పరచలేడు. అలాగే తన భార్య తనను ఎంతగానో నమ్ముతుందని, తనను ప్రేమిస్తుందని, గౌరవిస్తుందని, ఆమెకు తనే చాలా ఉత్తమమైన వ్యక్తి అని భర్తకు అర్థమైతే, తన భార్య చెప్పే విషయాలన్నీ అతను వినడానికి సిద్ధంగా ఉంటాడు. అలా కాకుండా అతని పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే అతను భార్యచెప్పే మాటలు వినడే వినడు. ఇది కుటుంబంలోని పిల్లలకు కూడా వర్తిస్తుంది. తల్లిదండ్రులు పిల్లల్ని అగౌరవపర్చకూడదు.

## విజయవంతమైన సంభాషణకు సూత్రాలు

### 1. శ్రద్ధ

ఇది మొదటి సూత్రం. చాలా సులభమైన, ప్రాముఖ్యమైన సూత్రం. తనపట్ల శ్రద్ధ చూపని వ్యక్తితో సంభాషించడం చాలా కష్టం. ఇక్కడ శరీర భాష కూడా చాలా ప్రాముఖ్యం. నీ శరీర భాషను బట్టే నీవు నీ భాగస్వామిపట్ల శ్రద్ధచూపుతున్నావో లేదో తనకు అర్థమౌతుంది. నీ ముఖకవళికలు, నీవు చూసే విధానం చాలా ప్రాముఖ్యం. ఎడమొహం, పెడమొహంగా ఉండడం, తలను వేరేవైపుకు త్రిప్పుకొని మాట్లాడడం మంచిదికాదు. వారివైపు చూడడం, వారు చెప్పేది వినడం, వారికి సరిగ్గా స్పందించడం వంటివి మీరు మీ జీవితభాగస్వామిపట్ల శ్రద్ధచూపిస్తున్నారనే విషయాన్ని తెలియజేస్తుంది.

### 2. అభినందన/పొగడ్త

వ్యతిరేక, తిరస్కార ఆలోచనలున్న వ్యక్తిని దేవుడు తన సన్నిధిలోకి రానియ్యడు. స్తుతిస్తూ మనం దేవుని సన్నిధిలోకి ప్రవేశిస్తాము. సంభాషణ విజయవంతమవ్వాలంటే అభినందనస్వరంతో నీవు మాట్లాడడం ప్రారంభించాలి. కించపరిచే, బాధపరిచే మాటలు వివాహాలను పాడుచేస్తాయి. అలాగని అసలు నెగిటివ్ విషయాలు చెప్పవద్దనికాదు. వాటిని చెప్పే విధానం చాలా ప్రాముఖ్యం. ముందు పాజిటివ్ విషయాలు చెప్పడం ద్వారా నెగిటివ్ విషయాలు ప్రస్తావించే అవకాశం వస్తుంది. నీ జీవిత భాగస్వామి

బలాలను గుర్తిస్తూ తనను అభినందించాలి. వారి బలహీనతలను ప్రస్తావిస్తూ విమర్శించవద్దు. ఎందుకంటే విమర్శలు వివాహ బాంధవ్యంలోని సాన్నిహిత్యాన్ని భంగం చేస్తాయి. విమర్శల ద్వారా నీ జీవిత భాగస్వామి హృదయాన్ని నీవు తాకలేవు, విజయవంతంగా సంభాషించలేవు. కాబట్టి నెగిటివ్ విషయాలు ప్రస్తావించడం మాని పాజిటివ్ విషయాల మీద దృష్టి పెట్టడం మంచిది.

### 3. సత్యం

ఒకరితో ఒకరు నిజాలు ప్రస్తావించే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రేమతో సత్యంచెప్పమని ఎఫెసీ 4:15లో ఉన్నది. సత్యములేని ప్రేమ టీమ్‌లో లేని ఛీర్‌లీడర్ లాంటిది. ప్రేమలేని సత్యము మత్తు ఇవ్వకుండా ఆపరేషన్ చేయడం వంటిది. ప్రేమలేని సత్యం చాలా హీనమైనది. సత్యములేని ప్రేమ అర్థరహితమైనది. మనకు రెండూ కావాలి. సత్యం మాట్లాడే హక్కు ఇద్దరికీ ఉండాలి. సరిగా అనుబంధాలు లేని కుటుంబంలో సంభాషణలు పూర్తిగా లేకుండా పోతాయి లేదా వారు సత్యం మాట్లాడకుండా ఉండిపోతారు. సరైన భాంధవ్యాలు ఉన్నటువంటి కుటుంబంలో భార్యా భర్తలు ఒకరితో ఒకరు ఇలా చెబుతారు. "మనం సత్యాన్ని మాట్లాడుకుందాం. మన వైవాహిక జీవితానికి సంబంధించిన కొన్ని నిజమైన విషయాలను ప్రేమతో చర్చించుకొందాము". సత్యం, ప్రేమతో కూడిన సంబంధాల ద్వారానే సాన్నిహిత్యం పెరుగుతుంది.

### 4. విశ్వాసం

విశ్వాసం లేకపోతే ఆ వైవాహిక జీవితం చాలా హీనమైనదిగా ఉంటుంది. ఒక్కమాటకూడా అవసరం లేకుండా తమ పవిత్ర ప్రవర్తన ద్వారా భార్యలు తమ భర్తలను మార్చవచ్చునని 1 పేతురు 3:1 తెలియజేస్తుంది. విశ్వాసము గల స్త్రీ తాను దేవుని పక్షంగా ఉన్నానని నమ్మి తన భర్తను గూర్చి ప్రార్థిస్తూ ప్రశాంతంగా ఉంటుంది. మారమని తన భర్తను ఎప్పుడూ ఒత్తిడి చేయదు. ఒత్తిడి చేయాలనే ఆలోచనతో ఎప్పుడూ నీ జీవిత భాగస్వామిని తిట్టడం, కసురుకోవడం వంటివి చేస్తే అది కుటుంబం మీద ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. దేవుడు నీ జీవిత భాగస్వామిని మార్చగల శక్తిమంతుడు.

### 5. లోబడుట

నా నోటిని నేను దేవునికి లోబరుస్తాను. నా నోరు దేవునిది. దాన్ని దేవుని కోసమే ఉపయోగిస్తాను.

## సంభాషణను ఆటంకపరచే నాలుగు చెడ్డ లక్షణాలు

### 1. పావురము

వీరికి శాంతి కావాలి. సత్యము చెప్పే ఒక మంచి వ్యక్తి పావురము. తమ జీవిత భాగస్వామి అంటే వీరికి భయం. అందుకే వారు నిజం చెప్పడానికి సందేహిస్తారు. నిజం చెప్పకపోతే నీ భాగస్వామిని నీవు ప్రేమించనట్టే లెక్క. నీవు నిజాన్ని ఎంతోకాలం దాచలేవు. ఎప్పుడో ఒకప్పుడు అది బయటకు వస్తుంది. దేవుని మీద విశ్వాసముంచి నీవు నిజాన్ని చెప్పాలి. ఇదే సరైన పద్ధతి. నిజం చెప్పడం వల్ల నీ జీవిత భాగస్వామి నిన్ను ద్వేషించినా, నీవు ప్రేమతో సత్యాన్ని చెప్పే లక్షణాన్ని మాత్రం నీవు మానుకోవద్దు.

### 2. గ్రద్ద

"నీదే తప్పు". గ్రద్ద తన భాగస్వామిని ఎప్పుడూ నిందిస్తుంది. ఇలాంటివారు చాలా తెలివిగలవారు, బలవంతులై ఉండొచ్చు. కాని భావోద్రేకపరంగా వీరు చాలా బలహీనులు. వీరు భాద్యత తీసుకోవడానికి ఇష్టపడరు.

### 3. గుడ్లగూబ

"న్యాయబద్ధంగా మనం మాట్లాడుకొందాం". ఈ వ్యక్తికి ఎలాంటి భావోద్రేకాలు ఉండవు. వీరు తమ భావోద్రేకాలను బహిర్గతం కాకుండా జాగ్రత్తపడతారు. వీరు చాలా న్యాయబద్ధంగా ఉంటారు. నిరాశ, తిరస్కరణ మొదలగు భావోద్రేకాల ను బయటకు కనిపించనివ్వరు.

### 4. నిప్పుకోడి

"పట్టించుకోకు, అదే సర్దుమణుగుతుంది. నా తలను ఇసుకలో దూరుస్తాను" అని ఇది అంటుంది. ఇతరుల పనులు, వారి కామెంట్స్‌ను ఇలాంటి వ్యక్తులు పట్టించుకోరు, వాటికి ప్రతిస్పందించరు. అసలు ఏ మీ జరగలేదు అన్నట్లు వ్యవహరిస్తారు. తమ చుట్టూ జరుగుతున్న దానిని వారు సరిగా గుర్తించలేరు.

**– వసంత్ కుమార్, ప్రణీత,** రిపేయిరర్ ఆఫ్ బ్రోకెన్ వాల్స్ ఫ్యామిలీ మినిస్ట్రీస్, హైదరాబాద్




# నిర్ణయాలు

## జీవిత దిశ, దశను మార్చేవి

"1958-62 సం॥లను 'మంచి భవిష్యత్ కోసం అద్భుతమైన అడుగులు వేసే కాలం'గా ప్రకటిస్తున్నాను. పారిశ్రామికీకరణ, సమిష్టిసేద్యం వంటి ప్రణాళికలతో మనదేశం అమె రికా, బ్రిటన్‌ల ను మించి ఆర్థిక ప్రగతి సాధిస్తుంది. అయితే ప్రజల ఆహార ధాన్యాలను, పండ్లను పక్షులు తిని వృథా చేస్తున్నాయి. దీనిని అరికట్టడానికి 'నాలుగు కీటకాల పై దండయాత్ర' జరగాలి. దేశంలో 'పిచ్చుకలు, ఎలు కలు, ఈగలు, దోమలు' లేకుండా సమూల నాశనం చేయండి" అని ఆదేశించాడు అప్పటి చైనా అధ్యక్షుడు మావో జడాంగ్.

ప్రజలు, అధికారులు, సైన్యం రంగంలోకి దిగి పక్షిగూళ్ళను పడదోసి, గుడ్లను పగలగొట్టి, పిల్లల ను చంపేశారు. పక్షులు నేలపై వాలకుండా చేశారు. రోజుకు రెండు లక్షల చొప్పున పక్షులన్నింటిని చంపేశారు. అయితే కీటకాలను తినే పక్షులు లేనందువల్ల పొలాల్లో మిడతలు, కీటకాల సంఖ్య విపరీతంగా పెరిగి పంటలను తినేశాయి. పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. వరుసగా మూడు సం॥లు పంటలు పాడై దేశంలో కనీవినీ ఎరుగని గొప్ప కరువు సంభవించింది. ఆహారం కోసం లెక్కలేనన్ని హత్యలు జరిగాయి. వీటన్నింటి ఫలితంగా నాలుగు కోట్ల యాభై లక్షల మంది ప్రజలు మరణించారు. మావో చేసిన ఒక్క నిర్ణయం చైనాదేశం మొత్తాన్ని అతలాకుతలం చేసింది.

### నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం

దేవుడు మానవుడిని తన స్వరూపంలో సృజించి నప్పుడు స్వేచ్ఛ ఇచ్చాడు. దేన్నైనా ఎంపిక చేసుకొనే మానసిక సామర్థ్యం, నిర్ణయాలు తీసుకొనే అధికారం ఇచ్చాడు. కాబట్టి సహజసిద్ధంగా నిర్ణయాలు తీసుకొనే లక్షణం, సామర్థ్యం అందరికీ ఉంటుంది. అందుకే మనం రోజూ అనేక నిర్ణయాలు తీసుకొంటాం. నిర్ణయాలు తీసుకోవడానికి ప్రధానంగా రెండు నైపుణ్యాలు అవసరం. ఒకటి ఊహించడం, రెండు అంచనా వేయడం. ఇవి అందరికీ ఉంటాయి. ఎవరైతే ఈ లక్షణాలను సమర్థవంతంగా ఉపయోగి స్తారో వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మావో మంచి కోసమే నిర్ణయం తీసుకొన్నా సరిగ్గా ఊహించడం, అంచనా వేయడంలో విఫలమై చెడ్డ నిర్ణయం చేశాడు.

బైబిల్లో యెరికోను వేగుచూడడానికి ఇద్దరు ఇశ్రాయేలీయులు వెళ్ళినప్పుడు ఈ లక్షణాల ఆధారం గానే రాహాబు సరైన నిర్ణయం చేసింది. వీరి సంగతి దేశ రాజుకు వర్తమానం వెళుతుందనీ, ఆయన సైనికుల ను పంపిస్తాడనీ ముందుగానే ఊహించి సిద్ధంగా ఉంది. వీరిద్దరిని దాచిపెట్టి కంగారు పడకుండా సైనికులకు సమాధానం చెప్పి పంపించింది. వీరిని వెతుకుతూ వారు యొర్దాను వరకు వెళ్ళి తిరిగి వచ్చే సరికి మూడు దినాలు అవుతుందని అంచనా వేసింది. విన్న సంగతుల ఆధారంగా వీరి దేవుడు నిజమైన, బలమైన వాడని గ్రహించి "యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడని... నేనెరుగుదును" (యెహో. 2:9) అని చెప్పింది. అలా సరైన నిర్ణయం తీసుకొన్న రాహాబు తనతోపాటు కుటుంబ సభ్యులను కాపాడుకొంది. అందుకే "విషయ పరిజ్ఞానం కంటే ఊహించడం చాలా ముఖ్యమైంది. విషయ పరిజ్ఞానం మనకు తెలిసిన విషయాలకు పరిమితమవుతుంది. తర్కం తెలిసిన దానిలో హేతుబద్ధత ఉందో లేదో చెబుతుంది. కానీ ఊహించడం నిన్ను విశ్వమంతటిలోకి నడిపించి

తెలియనివి తెలుసుకొనేలా సహాయపడుతుంది. కాబట్టి ఒక వ్యక్తి అసలైన ప్రజ్ఞా సామర్థ్యం ఊహించడమే" అంటారు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

## నిర్ణయాల ఫలితాలు, పర్యవసానాలు

ప్రతి నిర్ణయానికి నీడలా వెన్నంటి ఉండేది దాని ఫలితం, పర్యవసానం. మన ఇష్టం చొప్పున నిర్ణయాలు తీసుకొంటాం. అయితే వాటి పర్యవసానాలు మన చేతుల్లో ఉండవు. ఉదా॥ ఎత్తైన స్థలం నుంచి దూకాలో, వద్దో నిర్ణయించుకొనే స్వేచ్ఛ నీకు ఉంది. కానీ దూకితే – కింద పడిపోకుండా, నేలకు బలంగా తగలకుండా, దెబ్బలు తగలకుండా ఆపడం నీ చేతుల్లో ఉండవు. కాబట్టి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొనేముందు దాని ఫలితాలు, పరిణామాలు, పర్యవసానాలు జాగ్రత్తగా ఆలోచించుకోవడం అవసరం.

బైబిల్లో లూసీఫర్ తీసుకొన్న నిర్ణయం ఫలితంగా అతడు సాతానుగా మారాడు. ఆదాము హవ్వల నిర్ణయం వారికి అపరాధ భావన, సిగ్గు, శ్రమ, బాధ, దేవుని సన్నిధి నుండి, తోటలో నుండి వెలివేత, మరణం మొ॥గు పర్యవసానాలకు దారితీసింది. దీని ఫలితం వారికే పరిమితం కాకుండా యావత్ మానవజాతిపై పడింది. అందుకే "మనకు ఏమి చేయాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఉంది గానీ, ఆ తరువాత సంభవించే పర్యవసానాలను ఎంచుకొనే స్వేచ్ఛ లేదు" అంటారు జిగ్ జిగ్లర్. చెడ్డ నిర్ణయాలకు మంచి ఫలితాలు ఆశించడం సాధ్యం కాదు. ఏ విత్తనం విత్తితే ఆ పంటనే కోస్తావు. టమోటా విత్తనాలు విత్తితే టమోటాలే కాస్తాయి, పుచ్చకాయలు కాయవు.

## పర్యవసానాలు ఎలా ఎదుర్కోవాలి?

చాలామంది తమ నిర్ణయాలకు బాధ్యత తీసుకోరు, వాటినుండి పాఠాలు నేర్చుకోరు. పైగా పరిస్థితుల పై, ఇతరులపై నిందలు వేస్తారు. కొందరు ఏదైనా జరగగానే ఆ పరిస్థితుల నుండి పారిపోతారు. ఇంకొందరు వెనక్కి వెళ్ళి నిర్ణయాలు మార్చుకోవాలని ఆశిస్తారు కానీ సాధ్యం కాక జరిగిన దానిని తలంచుకొంటూ చింతిస్తూ ఉంటారు. సవాళ్ళను ఎదుర్కోకుండా, భవిష్యత్‌ను నిర్లక్ష్యం చేస్తారు. మరి కొందరు సణుగుతూ, గొణుగుతూ, వ్యసనపడుతూ దేవునికి వ్యతిరేకంగా మాట్లాడతారు. అలా కాకుండా బాధ్యత తీసుకొని దానిగుండా వెళ్ళినప్పుడు చాలావరకు దాని వ్యతిరేక ప్రభావాన్ని తగ్గించవచ్చు. దీనికి బైబిల్లో నయోమి జీవితం ఒక మంచి ఉదాహరణ.

## తప్పుడు నిర్ణయాలు ఎందుకు తీసుకొంటారు?

జీవితంలో ఒక్క తప్పుడు నిర్ణయం కూడా తీసుకోని వ్యక్తి ఎవరూ ఉండరు. చాలాసార్లు తప్పుడు నిర్ణయాలు చేయడానికి మొహమాటం, తప్పుడు నమ్మకాలు, తాత్కాలిక భావోద్వేగాలు, లోకపు ఆకర్షణలకు, బెదిరింపులకు లొంగిపోవడం కారణాలు అవుతున్నాయి. కొన్నిసార్లు మనకుండే అనుమానాలు, అపార్థాలు, అభ్యంతరాలు, ఆవేశాలు, ఎదురైన అవమానాలు తప్పుడు ఎంపికలకు కారణాలు అవుతున్నాయి. కారణాలు ఏమైనప్పటికీ "తప్పుడు నిర్ణయాలు తీసుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే ఆ తప్పుల నుండి ఎప్పుడూ నేర్చుకోక పోవడమే అసలైన సమస్య" అంటారు ఫిల్ క్రాస్బీ. అందుకే "మంచి నిర్ణయాలు తీసుకోవడానికి అను భవం ఉపయోగపడుతుంది. అయితే ఆ అనుభవం చెడ్డ నిర్ణయాల నుంచి నేర్చుకొనే పాఠాల ద్వారా వస్తుంది" అంటారు మార్క్ ట్వైన్.

## సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలి?

ఏ నిర్ణయమైనా దేవుని చిత్తానుసారంగా, ప్రార్థనా పూర్వకంగా తీసుకోవాలని వాక్యం సెలవిస్తుంది. అయితే నిర్ణయాలు తీసుకొనే విషయంలో ప్రధానంగా మూడు దశలు ఉంటాయి. ఒకటి – ఇంగిత జ్ఞానం ఉపయోగించడం, రెండు – వాక్యంలో ఉన్న దైవ నియమాలను అర్థం చేసుకోవడం, మూడు – దేవుని నడిపింపును గ్రహించడం.

### 1. ఇంగితజ్ఞానం (కామన్‌సెన్స్) ఉపయోగించడం:

ప్రతి విషయంలో ప్రార్థనా పూర్వకంగా ఉంటూ దేవుడు మనకు ఇచ్చిన ఇంగితజ్ఞానం ఉపయోగించి ప్రతిరోజు చాలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. బైబిల్లో దీనా ఇంగితజ్ఞానం విస్మరించి కొత్త ప్రదేశంలో ఒంటరిగా బయటకు వెళ్ళి ప్రమాదంలో చిక్కుకొంది. అలాగే పరిమిత వేగంతో వాహనం నడపడం, పెద్దలను గౌరవించడం, సకాలానికి రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, మొదటి నుండి కష్టపడి చదవడం, కొన్ని విషయాల్లో అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడం మొదలైనవన్నీ ఇంగితజ్ఞానానికి చెందిన విషయాలు. బైబిల్లో రెహబాము అనుభవజ్ఞుల సలహా కాకుండా స్నేహితుల సలహా తీసుకొని నష్టపోయాడు. మన ఆసక్తి, అభిరుచి, అంతర్గత సామర్థ్యాలకు

అనుగుణంగా చదివే సబ్జెక్టులు, చేసే వృత్తులను ప్రార్థనాపూర్వకంగా నిర్ణయించుకోవాలి.

కొన్ని విషయాలలో మనం ప్రార్థనా పూర్వకంగా ఇంగితజ్ఞానం ఉపయోగించి నిర్ణయించుకోవాలి. కొందరు వివాహ సమయానికి ముందే ప్రేమ పేరుతో తొందరపడితే, మరికొందరు వయసు పెరుగుతున్నా రకరకాల కారణాలతో ఆలస్యం చేస్తుంటారు. ఇలా చాలామంది తమ సొంత భావనలు, అనుభూతులు, నమ్మకాలు, అభిప్రాయాల ప్రకారం నడుచుకొంటూ దేవుడిచ్చిన ఇంగితజ్ఞానం పాత్రను విస్మరిస్తున్నారు. ఈ విషయమై "...యుక్తమార్గము తప్పక నడుచుకొనువారికి ఆయన కేడెముగా ఉన్నాడు" అని బైబిల్ చెబుతుంది (సామె. 2:7). అందుకే "ఇంగితజ్ఞానం లేని చదువు ఉండడం కన్నా చదువులేని ఇంగితజ్ఞానం ఉండడం వెయ్యిరెట్లు నయం" అంటారు రాబర్ట్ ఇంజర్‌సోల్.

## 2. వాక్యంలో ఉన్న దైవ నియమాలను అర్థం చేసుకోవడం:

వాక్యం బయలు పరచబడిన దేవుని చిత్తం. మన వ్యక్తిగత జీవితంలో, కుటుంబంలో, సహవాసంలో, సమాజంలో ఎలా జీవించాలో దేవుడు స్పష్టంగా రాయించాడు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి, కష్టపడి పని చేయాలి, విశ్వాసి విశ్వాసినే వివాహం చేసుకోవాలి, సంబంధాలలో సమాధానం కాపాడుకోవాలి, పరిశుద్ధంగా జీవించాలి, నోటిని, నాలుకను అదుపులో ఉంచుకోవాలి, తగ్గింపు స్వభావం కలిగి జీవించాలి, పొరుగు వారిని ప్రేమించాలి, ఇతరులను క్షమించాలి... ఇలా ఎన్నో విషయాలలో దేవుడు తన చిత్తం, ఉద్దేశాలు, నియమాలు బైబిల్లో తెలియజేశాడు.

కానీ చాలామంది ఇవన్నీ గ్రహించకుండా ఇంకా ఏవేవో తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. తెలియజేసిన విషయాలు పాటించకుండా ప్రార్థనలు చేస్తే దేవుడు కొత్త మర్మాలు బయలు పరుస్తాడా? దేవుని వాక్యంలోని ఆజ్ఞలు, బోధ, సత్యం మనకు వెలుగు, జ్ఞానం, జీవమై ఉన్నాయి. వీటిని గ్రహించలేక పోవడానికి ఒక కారణం మనసు మారి నూతన పరచబడక ఇంకా లోక మర్యాదను అనుసరించడమే (రోమా 12:2). దేవుని వాక్యం ద్వారా మనలో ఒప్పుదల కలగాలి, దృక్పథాలు మారాలి, తీర్మానాలు చేసుకోవాలి, దేవునికోసం ప్రతిష్ఠించుకొని ప్రత్యేకంగా జీవించాలి. విలువలకు, సంబంధాలకు, సత్యానికి, బాధ్యతలకు, నిబద్ధతకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడు చాలా విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడం సులువుగా ఉంటుంది.

## 3. దేవుని నడిపింపును గ్రహించడం:

మన ఇంగితజ్ఞానం ఉపయోగిస్తూ, వాక్య ప్రకారం నడుచుకొనే వారిని దేవుడు మిగిలిన విషయాలలో కూడా నడిపిస్తాడు. బైబిల్లో దానియేలు తనకు తెలిసిన దేవుని చిత్తప్రకారం తనను తాను అపవిత్రపరచు కొనకూడదని నిర్ణయించుకొని, ఇంగితజ్ఞానంతో అధికారి వద్ద వినయంగా బతిమాలుకొన్నాడు. అలా ఇంగితజ్ఞానం, తెలిసిన దేవునిచిత్తాన్ని అనుసరించి జీవిస్తున్న దానియేలుకు అవసరమైనప్పుడు తెలియబడని రాజు కలను, కల భావాన్ని దేవుడు బయలు పరిచాడు.

అలాగే ప్రభువైన యేసు ప్రతి ప్రాముఖ్యమైన నిర్ణయం తీసుకొనే ముందు ప్రార్థనలో సమయం గడిపాడు. చాలా సార్లు ఉపవాస ప్రార్థనలు చేసి దేవుని నడిపింపు ప్రకారం నిర్ణయాలు తీసుకొన్నాడు. ఉదా. కులాలు చూడకుండా, కట్నాలు ఆశించకుండా, సకాలంలో చదువు ముగించుకొని, శ్రద్ధగా ఉద్యోగం చేసుకొంటూ, విశ్వాసినే వివాహం చేసుకోవాలని ముందుగా నిర్ణయించుకొంటే అప్పుడు ఏ విశ్వాసిని చేసుకోవాలో వాక్యం ద్వారానో, పెద్దల సలహా ద్వారానో, పరిస్థితుల ద్వారానో స్పష్టత ఇస్తాడు. పై రెండు దశలు పాటించకుండా దేవుని నడిపింపు కోసం ఎదురు చూస్తే మిగిలేది నిరాశ, మనలను మనం చేసుకొనే మోసం లేదా మన స్వచిత్తాన్ని దేవుని చిత్తంగా ముద్ర వేసుకొని చలామణి అవుతాము.

## సరైన నిర్ణయాలకు సమయం మించిపోయిందా?

అందరూ ఒకేలాంటి నిర్ణయాలు తీసుకోవాలని ఏమీ లేదు. ఎవరి నిర్ణయాలు వారివే, ఎవరి ప్రత్యేకత వారిదే. నీ నిర్ణయాలు నిన్ను రూపొందిస్తాయి, నీ ప్రత్యేకతను తెలియజేస్తాయి. అయితే ఇప్పటి వరకు తీసుకొన్న నిర్ణయాలతో నష్టపోయినా, వెనుకబాటుతనం, ఓటమి వేధిస్తున్నా, జీవితమంతా వృధాగా, వ్యర్థంగా గడచినా, నిరాశ నిస్పృహలు పట్టి పీడిస్తున్నా, అజ్ఞానం, అవివేకం, తెలివి తక్కువతనం, బుద్ధిహీనత, భక్తిహీనత, బలహీనతలతో నీ జీవితం నిండివున్నా మంచి నిర్ణయం తీసుకోవడానికి సమయం మించిపోలేదు. సరైన నిర్ణయం ఇప్పుడైనా తీసుకోవచ్చు. మిగిలిన జీవితం ప్రయోజనకరంగా మార్చుకోవచ్చు.

**– విక్టర్ పిల్లి**

కథానిక



# ఏముందిలే, చిన్న విషయాలే కదా!

"ఏమండీ... ఏమండీ... నిద్ర లేవండి"

"పిల్లలూ... లేవండి.. టైమ్ అవుతుంది" అంటూ నిద్రలేపే ప్రయత్నంలో శైలజ ఉండగా అంతలో కుక్కర్ విజిల్ వినిపించి హడావుడిగా కిచెన్‌లోకి పరిగెత్తింది. 20 నిమిషాలు వంట గదిలోనే సరి పోయింది శైలజకి. మరలా వచ్చి చూస్తే ముసుగుతన్ని పడుకొన్న తన భర్త అభిషేక్ నిద్ర లేవకపోవడంతో కొంచెం గట్టిగానే అరిచింది. ఆ అరుపుకి తుళ్ళిపడి లేచిన అభిషేక్, "ఏమైంది శైలూ, కొంపలు మునిగి పోయేంత పని మంచి నిద్ర చెడగొట్టావు, అయినా ఈరోజు సెలవే కదా" అంటూ విసుక్కుంటుండగా... "అది కాదండి టైమ్ 8:00 అయింది. ఈరోజు ఫెలోషిప్ రిట్రీట్ కూడా ఉంది, 9 గంటలకు వెళ్ళాలి కదా! ఇంకా పడుకొంటే ఎలా చెప్పండి" అంటూ గోడ గడియారం వైపు చూపించింది.

అభిషేక్... "ఓస్! అదేనా నీ బాధ.. దానిదేముంది పది నిమిషాల్లో రెడీ అయిపోతాను అయినా 10 గంటలకు వెళ్తే ఏమైనా నష్టపోతామా? ఎవరైనా ఆపుతారా? అని అన్నాడు.

అంతలో శైలజ "మరి మీరు క్వైట్ టైం చేసుకోరా?" అభిషేక్ ఒక నవ్వు నవ్వి "ఏముందిలే ఒక రోజు, ఒక వారం చేసుకోకపోతే ఏమవుతుంది? పర్వాలేదులే, లైట్ తీసుకో" అంటూ రెడీ అవ్వడానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు సమయం ఉదయం 9:00 అవుతుంది. అభిషేక్ ఎటువంటి హడావుడి లేకుండా నిదానంగా రెడీ అవుతున్నాడు. శైలజ తను రెడీ అయ్యి పిల్లల ను కూడా రెడీ చేసింది.

ఇంతలో ఫోన్ మోగితే అభిషేక్ ఫోన్ తీసి అవతలి వైపు వినయ్ తమ్ముడితో దాదాపు 20 నిమిషాలుగా మాట్లాడుతూనే ఉన్నాడు.

శైలజ "ఏమండి, టిఫిన్ చేయండి" అనే మాటకి అభిషేక్ సరే తమ్ముడు మళ్ళీ మాట్లాడుతానంటూ ఫోన్ పెట్టేశాడు.

అభిషేక్ టిఫిన్ చేస్తూ చాలా ముభావంగా ఉండేసరికి "ఎవరండీ ఫోన్లో వినయ్ తమ్ముడేనా?" అని అడిగింది శైలజ. "అవును" అంటూ చాలా పొడిగా సమాధానం ఇచ్చాడు. "పెళ్లి గురించి గ్రాడ్యుయేట్ అన్న వాళ్ళు ఏమంటున్నారు?" అంటూ కొంచెం విషయం తెలుసుకొనే ప్రయత్నం చేస్తుంది శైలజ.

"ఏం చెప్పమంటావు? గ్రాడ్యుయేట్ అన్నవాళ్ళు నెల రోజుల నుండి ఇదిగో ఈ వారం చెప్తాము, ఆ వారం చెప్తాము అంటూ మాట దాటవేస్తున్నారు. ఆ అమ్మాయి అయితే దేవుని చిత్తమని చెప్పింది కానీ ముందుకు రావడం లేదు. కారణాలు తెలియడం లేదు. వినయ్ ఇంట్లో చెప్పుకోలేక సతమతమవుతున్నాడు. వినయ్ నాతో మాట్లాడుతూ అన్నా... గ్రాడ్యుయేట్ అన్నవాళ్ళు ఇలా అబద్ధాలు ఎలా చెబుతారు అంటూ వినయ్ అడిగే ప్రశ్నకి నా దగ్గర సమాధానం లేదు. అవునంటే అవును, కాదంటే కాదు అని చెప్పాలి. ఎందుకని అంత కన్ఫ్యూజన్ చేస్తున్నారు? మాటమీద నిలకడలేదని వినయ్ అడుగుతుంటే ఏమి చెప్పాలో

అర్థం కావడం లేదు. ఈ వారంలో ఈ విషయం అటో ఇటో తేలిపోవాలని అనుకొంటున్నాను, ప్రార్థన చేయండి అంటున్నాడు అని విషయమంతా శైలజకి చెప్పాడు అభిషేక్.

అంతలో శైలజ.. "అయితే గ్రాడ్యుయేట్ అన్నతో మీరే మాట్లాడవచ్చు కదా?" అంటూ అమాయకంగా అడిగింది. అన్నకి మొన్ననే ఫోన్ చేశాను కానీ అన్న "ఏముందిలే తమ్ముడూ, చిన్న విషయమే కదా, ఒక నెల, వారం అటూ ఇటూ అయితే తప్పేముంది, అంత తొందరెందుకు? పర్లేదులే లైట్ తీసుకో... అంత ఖచ్చితంగా అంటే కష్టం కదా, తమ్ముడికి సర్ధి చెప్పమన్నాడు" అంటూ విషయం వివరించాడు.

ఒక తమ్ముడు పట్ల చూపించే నిర్లక్ష్యం, మాట మీద నిలకడలేని తనాన్ని చూసి శైలజకు షాక్ కొట్టినంత పని అయింది. తమ్ముడు తల్లడిల్లి పోతుంటే 'ఏ ముందిలే, పర్లేదులే, లైట్ తీసుకో' అనే మాటలు గ్రాడ్యుయేట్ నోట్లో వినడంతో శైలజకి నోటి మాట రాలేదు.

అప్పటికే టైమ్ పది గంటలు అయింది. మెల్లగా కారు స్టార్ట్ చేసుకుని రిట్రీట్‌కి వెళ్ళిపోయారు. హాలంతా నిండిపోయింది. వాక్యం చెప్పడం అప్పటికే సగం అయిపోయింది. అభిషేక్‌కి డౌట్ వచ్చింది. మన ప్రోగ్రామేనా లేక వేరే వాళ్ళ ప్రోగ్రాం నా అని. ఏ రోజూ బైబిల్ స్టడీకి రాని చాలామంది అక్కడ ఉండటం చూసి ఏంటీ ఈ అద్భుతం అనుకొన్నాడు. కాసేపటికి టీ బ్రేక్ ఇచ్చారు.

టీ తాగుతూ అభిషేక్ ఎప్పుడో చూసినట్లు అనిపించిన శ్రీకాంత్ తమ్ముడు భుజం మీద చేయి వేశాడు. "ఏంటి శ్రీకాంత్ అసలు బైబిల్ స్టడీకి రావడం లేదు? అంటూ అడిగాడు. అంతలో శ్రీకాంత్ "ఏముందిలే అన్న చిన్న విషయం కదా, పర్లేదులే, ప్రతివారం ఎక్కడ వస్తాం, చాలా బిజీ.. ఇలాంటి ప్రోగ్రామ్స్, క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లు అయితే అప్పుడప్పుడూ రావచ్చు, అందరూ వస్తారు, చక్కటి వాక్యం వింటాము" అని చెబుతుంటే అభిషేక్ షాక్‌కి గురయ్యాడు.

నెలకు కనీసం ఒక వారం లేదా రెండు వారాలు కూడా సహవాసానికి రాకుండా ఇలాంటి ప్రోగ్రామ్స్, క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లకు వచ్చి లెక్కకు గ్రాడ్యుయేట్స్ అని అనిపించుకొనే వారు శ్రీకాంత్‌లా ఎంతోమంది ఉన్నారనిపించింది. ఏముందిలే చిన్న విషయమే కదా పర్వాలేదులే అనే మాటలు తన చెవిలో గిర్రున తిరుగుతున్నాయి. రిట్రీట్‌లో, స్పీకర్ అన్నతో శ్రీకాంత్ చేసిన హడావుడి అంతా చూసి ముక్కున వేలేసుకున్నంత పని అయింది అభిషేక్‌కి.

రిట్రీట్ అయిపోయింది. సాయంత్రం ఇంటికి వెళ్ళగానే పిల్లలు ఆకలిగా ఉన్నారని పకోడీలు వేయడానికి శైలజ సిద్ధమైంది. అభిషేక్ సోఫాలో నడుము వాల్చుకొని ఆలోచిస్తున్నాడు. "ఏముందిలే, చిన్న విషయమే కదా! పర్వాలేదులే, తప్పేముంది, చిన్నదే కదా" ఈ మాటలే పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

ఇంతలో శైలజ ఫోన్ రింగ్ అయింది. కిచెన్‌లో పకోడీలతో బిజీగా ఉన్న శైలజ ఏమండీ కొంచెం ఫోన్ చూడండి అంటూ రిక్వెస్ట్ చేసింది. అభిషేక్ లేచి ఫోన్ తీసి మేరీ అక్క అంటూ ఫోన్ లిఫ్ట్ చేయబోయాడు. అంతలో శైలజ వద్దండి, ఇప్పుడు మాట్లాడలేను, అక్క గొప్పలు చెప్పడం స్టార్ట్ చేసిందంటే మనకు అర్ధరాత్రి అవుతుంది. తర్వాత మాట్లాడతానులే అంటూ ఫోన్ లిఫ్ట్ చేయనివ్వలేదు. తర్వాత అక్కకి అలా మాట్లాడవద్దని చెప్పొచ్చుకదా అంటే, చాలా సార్లు చెప్పినా వినలేదని చెప్పింది శైలజ.

పకోడీల ప్లేట్ ఖాళీ చేశాడు అభిషేక్. శైలజ పిల్లలతో హోంవర్క్ చేయిస్తుంది. రాత్రి డిన్నర్‌కి చికెన్ తీసుకురావడం కోసం అభిషేక్ బయటికి వెళ్ళి చికెన్ తీసుకొచ్చాడు. పిల్లలు ఇంటి వరండాలో ఆడుకుంటున్నారు. శైలజ కిచెన్‌లో ఉంది. ఇంతలో సుధీర్ వచ్చాడు.

సుధీర్ పక్కన కూర్చొని భుజం మీద చేయి వేసి మాట్లాడటం స్టార్ట్ చేశాడు అభిషేక్. "సుధీర్ రిజల్ట్స్ వచ్చాయి అని విన్నాను ఏమైంది నీ రిజల్ట్ అని?" అడిగేసరికి సుధీర్ తుడుముకోకుండా "పర్వాలేదన్న మూడు సబ్జెక్టులే ఫెయిల్ అయ్యాను, మూడు పాస్ అయ్యాను. ఏమీ కాదులే. సప్లీలో పాస్ అవుతాను" అంటూ ఏమాత్రం బాధ లేకుండా చెప్పేస్తున్నాడు.

అభిషేక్‌కి అర్థం కాక "తమ్ముడూ అసలే ఫైనలియర్ కదా అంటూ ఆందోళన వెళ్ళబుచ్చుతుండగా" "సుధీర్ ఏముందిలే అన్న మూడు సబ్జెక్టులు చిన్న విషయమే కదా పర్లేదులే, లైట్ తీసుకొంటాను, దేవుడు ఆయన నమ్మిన బిడ్డల్ని పాస్ చేయకుండా వదిలేస్తాడా?

ఉద్యోగం ఇవ్వడా ఏంటీ? పరిచర్య గురించి సరిగా చదవలేకపోయాను. చందు ఐదు సబ్జెక్ట్స్‌లో ఫెయిల్ అయ్యాడు. నేను పర్వాలేదు గదా అంటూ" తన అసమర్ధతను సమర్ధవంతంగా వివరిస్తున్నాడు. గంట తర్వాత భోజనాలు సిద్ధపరిచింది శైలజ. సుధీర్ వాళ్ళతో పాటు భోజనం చేసి తన రూమ్‌కి వెళ్లిపోయాడు. శైలజ పిల్లలను నిద్ర పుచ్చటానికి బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది. సోఫాలో పండుకొంటే అభిషేక్‌కి "ఏముందిలే, పరవాలేదు, చిన్న విషయమే లైట్ తీసుకో" అనే మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. ఆలోచిస్తూ నిద్రలోకి జారుకొన్నాడు.

సరిగ్గా నెలరోజుల తర్వాత వినయ్ దగ్గర నుండి ఫోన్ వచ్చింది. పెళ్ళి క్యాన్సిల్ అయ్యింది. మూడు సంవత్సరాలవుతున్నా మధ్యవర్తులుగా ఉన్న గ్రాడ్యుయేట్స్‌లో సీరియస్‌నెస్ లేదు. దేవుని చిత్తమని చెప్పిన అమ్మాయి కూడా ధైర్యం చేసి ముందుకు రావడంలేదు. వినయ్ ఫోన్ పెట్టేసిన తర్వాత చాలా బాధనిపించింది అభిషేక్‌కి. గ్రాడ్యుయేట్స్ అశ్రద్ధను బట్టి వినయ్ ఎంతో బాధపడ్డాడు.

మూడు నెలల తర్వాత... బైబిల్ స్టడీకి వెళ్ళకుండా ఇంట్లో ఉన్న అభిషేక్‌కి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో "సుధీర్ తమ్ముడు విశ్వాసంలో తప్పి పోయాడు అని తెలిసింది. అప్పటికే ఉన్న బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్స్‌ను క్లియర్ చేయలేక, దేవుడు తనకు అన్యాయం చేసినట్లు చెబుతున్నాడని" ప్రవీణ్ ఫోన్‌లో చెప్పాడు.

అభిషేక్ తన గురించి తాను ఆలోచించుకొన్నప్పుడు తనది అదే మైండ్ సెట్ అని అర్థమైంది. తను క్వైట్ టైమ్ సరిగా చేసుకోడు, టైమ్‌కి సహవాసానికి వెళ్ళడు. పరిచర్య పట్ల నిర్లక్ష్యంగా ఉంటాడు, తోటి విశ్వాసుల సమస్యల పట్ల శ్రద్ధలేదు. ఉన్నప్పటికీ ఏముందిలే చిన్న విషయమే కదా పర్వాలేదులే అనుకోవడం, చాలాసార్లు సహవాసంలో, భార్యకు, ఆఫీస్‌లో అబద్ధాలు చెప్పడం, మాట మార్చడం, అలసత్వం ఇవన్నీ తనలో ఉన్నాయి. హృదయం బరువెక్కింది. మనసుకి బాధనిపించింది. ఎదుటి వారిలో ఇలాంటి లక్షణాలు చూసినప్పుడు వారి ని నిలదీయాలని, ఖచ్చితంగా ఉండమని చెప్పాల నుకొనేవాడు. కానీ చెప్పలేదు. ఎందుకంటే తనదీ వారిలాంటి జీవితమే కదా! ఇప్పుడు అంతరాత్మ తనను గద్దిస్తుంది. కనుల వెంట కారుతున్న కన్నీళ్ళను ఆపుకొనే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నాళ్ళీ నటన? ఇక చాలు అనుకున్నాడు.

అలా ఆలోచిస్తుండగా శైలజ వచ్చింది. "ఏమండీ తెలుసా శ్రీకాంత్ తమ్ముడు మన గ్రాడ్యుయేట్స్ తో గొడవపడి నానా రభస చేశాడంట" అంటూ బాధపడింది. గతంలో శ్రీకాంత్ చెప్పిన మాటలు మరలా గుర్తుకు వచ్చాయి "ఏముందిలే అన్నా, చిన్న విషయమే కదా రెగ్యులర్‌గా రాలేను". చిన్న చిన్న విషయాలే పెద్ద సమస్యలకు, దేవునికి దూరమవ్వడానికి, దేవునిలో ఫలించక పోవడానికి దారితీస్తాయని అభిషేక్‌కు అర్థమైంది.

అభిషేక్ తన భార్యతో "ఈరోజు మనము ఫ్యామిలీ ప్రేయర్ చేసుకొందామని" చెప్పాడు. శైలజకి అర్థం కాలేదు. ఇదేంటి కొత్తగా మాట్లాడుతున్నాడు అనుకొంది. ఆరోజు యోహాను సువార్త నాలు గవ అధ్యాయం చదువుతూ 4:24 దగ్గర అభిషేక్ ఆగిపోయాడు "ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" అనే మాట చదవడం చాలా కష్టం అనిపించింది. సత్యం లేని మాటలు, ఆత్మ దేవుని స్వభావం లేని మనసు ఆరాధనకు అడ్డంకి అనే సంగతి అర్థమైంది. ఎన్నాళ్ళు దేవునికి దూరంగా ఉంటూ ఆరాధించానని అనుకొన్నాడో అభిషేక్‌కు అర్థమైంది. అనుకోకుండా గోడవైపు చూశాడు యుఇయస్ఐ-ఏపి కొత్త క్యాలెండర్ జనవరి 2024 గోడకు తగిలించి ఉంది. "ఎవడైనను క్రీస్తునందున యెడల వాడు నూతన సృష్టి పాతవి గతించిను, ఇదిగో క్రొత్తవాయెను" అనే మాట ఇంకా బలంగా హృదయాన్ని తాకింది. చిన్నవిగా కనిపించేవి, పర్వాలేదులే అనిపించి, ఏముందిలే అని అనుకొన్న అనేక పాపాలు అభిషేక్ ముందు కదలాడుతున్నాయి. అభిషేక్ వైపు అలా చూస్తుండి పోయింది శైలజ. అభిషేక్ వస్తున్న కన్నీళ్ళను ఆపుకొంటూ "దేవా చిన్నవిగా కనిపించే పాపాల నుండి నన్ను విడిపించు, రక్షించు" అని ప్రార్థించాడు.

శైలజకి ఎంతో సంతోషం అనిపించింది. తను కూడా కొత్త క్యాలెండర్ జనవరి 2024 వైపు చూసింది. "యెహోవా సంవత్సరములు జరుగుచుండగా నీ కార్యము నూతన పరచుము" అనే మాట చదివి హృదయపూర్వకంగా దేవునికి వందనాలు చెల్లించింది.

**– యం. గాలెయ్య,** భీమవరం

# జీవితం అల్పమైనది



జీవితం అల్పమైనది!
అల్పమైన రోజులు స్వల్పమైన సంవత్సరాలు
గడిచిపోతున్న గంటలు పరుగులు తీస్తున్న నిమిషాలు
ఇంతలో అభివందనం చేస్తాయి
అంతలో వీడ్కోలు పలుకుతాయి
జీవితకాలం ఎంతగా కుదించబడింది!


జీవితంలో ఎదురొచ్చేవన్నీ అల్పమైనవే!
ఆశలు అవకాశాలు ఆనందాలు అనురాగాలు
అన్నీ ఇంతలో ముందుకొచ్చి అంతలో మాయమయ్యేవే
ప్రతి నిమిషం నిత్యత్వంతో ముడిపడి ఉండేదే
ఈ జీవితంలో అన్నీ అల్పమైనవే
మనకు కనిపించేవన్నీ స్వల్పమైనవే!

జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో, ఎన్నెన్నో!
కానీ, అవన్ని కేవలం అల్పమైనవే స్వల్పమైనవే
నువ్వు వేసే ప్రతి అడుగునూ ఆయన గమనిస్తున్నాడు
నీ ప్రతి పనిని ఆయన తన గ్రంథంలో లిఖిస్తున్నాడు
తనకోసం చేసే ప్రతి పనికి నీకు నిత్యమైన బహుమానం
జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో ఎన్నెన్నో!

కానీ, అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!
నిత్యమైన పంటకోసం విత్తబడే విత్తనాలే అవన్నీ
నిత్యమైన ఆనందాన్ని అందుకొనే అవకాశాలే అవన్నీ
వెయ్యంతల ఆశీర్వాదాల్ని అందించే అనుభవాలే అవన్నీ
నువ్వు చేసే ప్రతి మంచిపనీ వెలకట్టలేనంత విలువైనదే
నీకు అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!

దేవుని కోసం నువ్వు పడే కష్టాలు నష్టాలు కావు!
ఆయన కోసం జీవించే జీవితం ఎన్నటికీ నష్టాన్నివ్వదు
ఆయన కోసం నువ్వు ఖర్చు చేసే నీ సమయం
ఆయన పేరిట దరిద్రులకు నువ్వు చేసే దానధర్మాలు
ఆయన కోసం నువ్వు పడే శ్రమలు ప్రయాసలు
అన్నీ పరలోక పట్టణం కోసం నువ్వు పెట్టే పెట్టుబడులే!

– వెస్లీ. యల్. డ్యూవెల్
(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)



# దీనత్వం, తగ్గింపు

## దీనత్వం, తగ్గింపు ఎందుకు?

కళాశాల విద్యార్థుల మధ్యలో పరిచర్య చేయాలంటే తగ్గింపు జీవితం కలిగిన వాళ్ళు ఎంతైనా అవసరం. తనను తాను తగ్గించుకోవడం చేతకాని వారు పరిచర్యను ఎంత మాత్రమూ చేయలేరు, దేవుని సేవలో ముందుకు సాగలేడు, దేవునిని వెంబడించలేడు. యేసుక్రీస్తు ప్రభువును వెంబడించాలంటే తనను తాను ఉపేక్షించుకోవాలి, తన సిలువను ఎత్తుకోవాలి. సిలువను ఎత్తుకోవడం అంటే అవమానాలను భరించడానికి సిద్ధంగా ఉండాలి. తనను తాను తగ్గించుకోని వాడు తనను తాను ఉపేక్షించుకోలేడు. ఇతరులు తన మాటలను పట్టించుకోపోయినా, తనను గౌరవించకపోయినా ఎంతో కోపం తెచ్చుకొని కృంగిపోతారు. అట్టివారు దేవుని సేవకు ఉపయోగపడకపోగా, వీరి వలన దేవుని సేవకు ఆటంకమవుతుంది. అందువలన మనలను మనము తగ్గించుకుంటూ విద్యార్థుల సేవలో కొనసాగాలి.

## యుఇయఎస్ఐ విజన్, మిషన్ నెరవేరాలంటే తగ్గింపు జీవితం కావాలి

యుఇయఎస్ఐ పరిచర్య ముందుకు సాగాలంటే మన విజన్, మిషన్‌ను మర్చిపోకూడదు. కళాశాల విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు నందు తిరిగి జన్మించాలి (యోహాను 3:3-6). తిరిగి జన్మించిన వారిని క్రీస్తు శిష్యులుగా తర్ఫీదు చేయాలి. అంటే రక్షణ పొందిన విద్యార్థులు దినదినము శిష్యులుగా ఎదగాలి, ఆయనను వెంబడించాలి. యేసుక్రీస్తు ప్రభువును వెంబడించాలంటే తన్ను తాను ఉపేక్షించుకోవాలి తన సిలువను ఎత్తుకోవాలి (మార్కు 8:34). అనుదిన జీవితంలో ప్రతి విషయంలోనూ ప్రభువుతో నా ఇష్టం కాదు, నీ ఇష్టమే జరగాలని మనం చెప్పాలి. ఇలా చెప్పాలంటే మనలో తగ్గింపు ఉండి తీరాలి. ఇంకా వివరంగా చెప్పాలంటే పరిశుద్ధ గ్రంథంలోని వాక్య ప్రకారం మనం జీవించడానికి మనలను మనమే ప్రభువుకు అప్పగించుకోవాలి. తన్ను తాను తగ్గించుకోలేని వారు, తన జీవితాన్ని ప్రభువుకి అప్పగించుకోలేనివారు ఆ మాట చెప్పలేరు. ఈ ప్రాథమిక విషయాల నుండి తప్పిపోతే మనలను మనం సరి చేసుకొందాం.

## విద్యార్థులు ఏ యే విషయాల్లో తగ్గింపు కలిగి ఉండాలి?

### 1. చదవడంలో

ప్రతి విద్యార్థి ఎంతో కష్టపడి పాఠాలను చదివి అర్థం చేసుకొని నేర్చుకోవాలి. విషయం అర్థమయ్యే వరకు మరలా, మరలా చదవాలి కష్టపడడం అంటే తన్ను తాను తగ్గించుకొని పుస్తకాల ముందు కూర్చొని ప్రతి లైన్ చదవాలి. అర్థం కాకపోతే ఇతరులను అడగాలి. లెక్చరర్స్ వద్దకు వెళ్ళి తెలుసుకోవాలి. అలా చేయాలంటే తగ్గింపు ఎంతో అవసరం. గర్విష్టులు, సోమరులు ఇష్టానుసారంగా రోడ్ల వెంబడి తిరుగుతూ, ముచ్చట్లతో, మొబైల్‌తో కాలం గడుపుతూ కష్టపడి కూర్చొని చదవడు. లైబ్రరీకి వెళ్లి సంబంధిత పుస్తకాలను చదవడు. "చేతికి వచ్చిన ఏ పని అయినను శక్తి లోపం లేకుండా చేయుము" అని ప్రసంగి చెబుతున్నాడు (ప్రసంగి 9:10).

### 2. తల్లిదండ్రులను గౌరవించడంలో

ఈ రోజుల్లో చాలామంది కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రులను ఎదిరించే వారిగా ఉన్నారు. తల్లిని తండ్రిని నిర్లక్ష్యపెడుతూ వారిని గౌరవించడం లేదు. ఈ విషయం మనం విద్యార్థులతో మాట్లాడాలి. తల్లిదండ్రులను సన్మానించడం ప్రతి విద్యార్థి అల వర్చుకోవాలి. ఇది వాగ్దానంతో కూడిన ఆజ్ఞలలో మొదటిది (నిర్గమ 20:12; ఎఫెసీ 6:1-3). గర్విష్టులైన విద్యార్థులు తల్లిదండ్రులను ఎదిరి స్తారు, ఎంతమాత్రమును తల్లిదండ్రులు చెప్పిన మాట వినరు. వినయ మనస్కులు తల్లిదండ్రులను గౌరవిస్తారు, లోబడతారు.

### 3. దేవుని వాక్యమును ధ్యానించడంలో

మన ఇయు విద్యార్థులు శిష్యులుగా ఎదగాలంటే యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు

దివారాత్రము దాని ధ్యానించాలి (కీర్తనలు 1:2). ఉదయం మాత్రమే కాకుండా మధ్యాహ్నం, సాయంకాలం, రాత్రి దేవుని వాక్యాన్ని చదవడం అలవాటు చేసుకోవాలి. దేవుని వాక్యాన్ని గైకొనడం వల్ల గొప్ప లాభం కలుగుతుంది (కీర్తనలు 19:11). దేవుని వాక్యమును చదువుతూ ధ్యానించే కొలది తేనెకంటెను జుంటి తేనె ధారలకంటెను మధురముగా ఉంటుంది (కీర్తనలు 19 10). ప్రతి ఇయు విద్యార్థి దేవుని వాక్యం చదివేటట్లు వారిని బలపరచాలి, ప్రోత్సహించాలి. దేవునికి భయపడేవారు వినయం గలిగి దేవుని వాక్యమును శ్రద్ధగా చదివి అర్థం చేసుకొంటారు. గర్విష్టులైన వారు సోమరులుగా ఉంటారు. వీరికి దేవుని వాక్యం అంటే ఏమాత్రము లక్ష్యముండదు.

### 4. సువార్త ప్రకటించడంలో

ఈ దినాల్లో చాలామంది విద్యార్థులు ప్రేమ వ్యవహారాలలో మునిగి తమ జీవితాల్ని పాడు చేసుకొంటున్నారు. ఈ ప్రేమ వ్యవహారం వలన విద్యార్థులు విశ్వాసము నుండి తొలగిపోతూ, దేవుని విడిచి సాతానుకు దాసోహం అవుతున్నారు. అందువలన వీరికి దేవుని వాక్యం పట్ల ఆసక్తి ఉండడం లేదు. ఇతరులకు సువార్త చెప్పాలని, ఇతరులను దేవుని దగ్గరకు నడిపించాలని, ఇతరుల రక్షణ కొరకు ప్రార్థించాలనే ఆసక్తి రోజు రోజుకూ తగ్గిపోతుంది. ఈ విషయంలో మనము మన విద్యార్థులను కఠినంగా హెచ్చరించాలి, గద్దించాలి.

ప్రతి ప్రేమ వ్యవహారం మోహపు చూపుతో ఆరంభమవుతుంది. ఒక స్త్రీని మోహపు చూపుతో చూచువాడు అప్పుడే తన హృదయముందు ఆమెతో వ్యభిచారం చేసిన వాడు (మత్తయి 5:28). అందువల్ల ప్రేమ వ్యవహారంలో ఉన్న ప్రతి విద్యార్థి తప్పక తెలుసుకోవాల్సిందేమంటే ప్రేమ వ్యవహారం దేవుని దృష్టిలో వ్యభిచారమే. అందువలన ఈ పాపంలో ఉన్నవారు తాము తమ హృదయమందు ప్రతిదినం వ్యభిచారం చేస్తున్నారని దేవుని సన్నిధిలో ఒప్పుకోవాలి. అలా ఒప్పుకొంటే దేవుడు విడుదల అనుగ్రహిస్తాడు (1 యోహాను 1:9). కొంతమంది విద్యార్థులు ప్రేమ వ్యవహారాలలో జీవిస్తూ తాము గొప్ప హీరోలమని నమ్ముతూ తమ్మును తాము మోసగించుకొంటారు. జారత్వం జరిగించువాడు కేవలం బుద్ధి శూన్యుడు అనియు ఆ కార్యం చేయువాడు స్వనాశమును కోరుకోవడమే అని సామెతలు 6:32 తెలియజేస్తుంది.

### గ్రాడ్యుయేట్స్ ఏ యే విషయాల్లో తగ్గింపు కలిగి ఉండాలి?

ప్రతి ఇయు విద్యార్థి పై లక్షణాలు కలిగి ఉండేటట్లు తర్ఫీదు చేయాలంటే ప్రతి ఇజియఫ్ మెంబర్‌కు దీనత్వం, తగ్గింపు అవసరం. తన్ను తాను తగ్గించుకోనివారు దేవుని సేవలో ముందుకు సాగలేరు. కళాశాల విద్యార్థులు హాస్టల్స్‌లో, రూమ్స్ అద్దెకి తీసుకొని ఉంటారు. మరికొందరు తల్లిదండ్రుల వద్ద నుండి చదువుకొంటారు. వీరిని ఇజియఫ్ మెంబర్స్ వ్యక్తిగతంగా కలుసుకొని మాట్లాడాలి. వారి మాటలు వినాలి. ఒక్కొక్క పర్యాయం గంటల తరబడి వారితో మాట్లాడుతూ ఉండాలి. వారు చెప్పేది ఓపిగ్గా వినాలి. ప్రతి విద్యార్థి గురించి పట్టుదలతో ప్రార్థించాలి. ప్రతి విద్యార్థి క్రీస్తులో సంపూర్ణుడయ్యే వరకు మనం బహుగా శ్రమించాలి. తగ్గింపు లేని వారు సమయమివ్వలేరు, శ్రమించలేరు.

ఇజియఫ్ మెంబర్ అంటే చక్కని పదజాలంతో ప్రసంగములు చేసేవాడు కాదు. ఇయు విద్యార్థుల ను అర్థం చేసుకొంటూ వారిని అనుదిన జీవితంలో దేవుని వాక్యాన్ని అనుసరించేటట్లు బలపరచాలి, నడిపించాలి. ఈ విధంగా ఇయు పరిచర్యలో కష్టపడినప్పుడు దేవుడు ప్రతిఫలాన్ని దయ చేస్తాడు. దేవుడు ఎవరికినీ, ఏమాత్రమును అచ్చి ఉండేవాడు కాదు. విద్యార్థులు మన ఇంటికి వచ్చి దేవుని వాక్యం నేర్చుకొనేటట్లు మన గృహాలను తెరుద్దాం. మన ఇంట్లో బైబిల్ పుస్తకములను ఇయు విద్యార్థులు చదువుకోవాలి. వారికి యాత్రికుని ప్రయాణం, పరిశుద్ధ పోరాటం, సాధారణ క్రైస్తవ జీవితం లాంటి పుస్తకాలను పరిచయం చేయాలి. మన ఇల్లు విద్యార్థులను శిష్యులుగా తయారు చేసే కేంద్రం కావాలి. వారి కష్టాలు, సమస్యలు విందాం. దేవుని పనిలో ముందుకు సాగుతున్నప్పుడు సాతానుడు మన మీద దాడి చేయకుండా ఉండడు. నిందలు అవమానాలు కలుగుతాయి, కొంతమంది ఎగతాళి కూడా చేస్తారు. వీటన్నిటిని భరిస్తూ ముందుకు సాగాలి అంటే దీనత్వం, తగ్గింపు అవసరం.

**– డా. పిట్టా సిరాజ్**
ఇవాంజిలిస్ట్ విజయవాడ

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2024-2026**

**Date of Printing: 25-11-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ఇదిగో కొత్తవాయెను

పాతవి గతించెను
సమస్తమూ కొత్తవాయెను
అంటూ
మునుపెన్నడూ నడవని దారిలో
నిన్ను నడిపించాలని
మనుషులెన్నడూ తినని
మధురమైన మన్నాతో
నిన్ను పోషించాలని
నీ పరలోక తండ్రి ఆశ!

భూ భ్రమణమో పరిభ్రమణమో
రోజులు బంతిలా దొర్లిపోతున్నాయి
కాలం ఎన్నటికీ ఆగని రైలులా
పరుగులు తీస్తుంది!
అయినా ఐగుప్తులోనే ఉండి
బానిసత్వం అనుభవించడానికి
రోదిస్తూ రోజంతా
ఫరోకు ఊడిగం చేయడానికి
గతించిన కాలమే చాలు!

నిరుడు ఎన్నోసార్లు, నేడు కూడా
చావుకు చేరువలో ఉన్నా
ఆపదలకు అడుగు దూరంలో ఉన్నా
ఏ దిక్కూ కనబడని
చీకటి సమయాల్లో
దారిచూపే అగ్ని స్తంభంలా
శోకంతో సొమ్మసిల్లిపోతున్న
ఎండవేళ
చల్లని నీడనిచ్చే మేఘ స్తంభంలా
దప్పికతో నాలుక పిడచుకట్టుకొన్నప్పుడు
దాహం తీర్చే బండలా
నిన్ను నడిపిస్తున్నాడు
నీ మొరను విన్న రక్షకుడు

వేసవి వడగాలుల తర్వాత
చల్లగాలి వీచినట్టు
వేదన తీర్చే వాగ్దానాలు ఎన్నో...
తుఫాను బీభత్సం తర్వాత
చిరుగాలి తాకినట్టు
నెమ్మదినిచ్చే పలుకులెన్నో...
నమ్మి ముందుకే వెళ్తే
పాలు తేనెలు ప్రవహించే దేశం
ఎదురు చూస్తుంది
ఇంతకు ముందు వెళ్ళిన త్రోవను వదిలి
కొత్త దారిలో వెళ్దాం
కొత్త వారిలా మారదాం

– గొంగటి మేరిజాయ్, ఆదోని